అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 12 ఏప్రిల్ 2025 పేజీలు : 04


# అధైర్య పడొద్దు... నేనున్నా...

**- వడగళ్ల బాధిత రైతులకు ప్రభుత్వ విప్ కాలవ అభయం. - క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని కళ్లారా చూసిన కాలవ.**

**- ఎమ్మెల్యేతో తమ బాధను వ్యక్తం చేసిన రైతులు. - కూటమి ప్రభుత్వం రైతు కన్నీరు తప్పక తుడుస్తుంది. కాలవ**




నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

**కణేకల్లు, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** అకాల వర్షం, వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటకు ప్రభుత్వం నుండి పరిహారం అందేలా చేస్తానని, ఎవ్వరూ అధైర్య పడొద్దని రైతన్నకు ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు భరోసా ఇచ్చారు. నియోజకవర్గం లోని కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను శుక్రవారం అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. పంట పెట్టుబడులు భారీగా పెరిగిపోయాయని, చేతికందాల్సిన పంట వడగళ్ల వానతో పడిపోయిందని బొమ్మనహాళ్ మండలంలోని శ్రీధరఘట్ట, గోనేహాళ్, కణేకల్లు మండలంలోని ఎర్రగుంట, గోపులాపురం, ఒబుళాపురం గనిగెర తదితర గ్రామాల రైతులు ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. పంటపై ఎన్నో ఆశలు పెట్టుకున్నామని, ఆర్థికంగా కోలుకోలేని విధంగా దెబ్బతిన్నామని వాపోయారు. ఎకరానికి రూ.17, రూ.18వేలకు కౌలుకు తీసుకుని పంట వేశామని, పంట ఖర్చులు కలుపుకొని ఎకరానికి దాదాపు రూ.65వేల వరకు నష్టపోతున్నట్లు వివరించారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం దయతలిచి ఆదుకోకపోతే కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉందని ఆయా గ్రామాలకు చెందిన రైతులు కుబేర, రాజేశ్వరమ్మ, శివలింగప్ప, వడ్డే రామ రాజు కన్నీటి పర్యంత మయ్యారు. క్షేత్రస్థాయిలో జరిగిన పంట నష్టాన్ని కళ్లారా చూసిన కాలవ నిర్ఘాంత పోయారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతు కన్నీరు తప్పక తుడుస్తుందని భరోసా ఇచ్చారు. ఇబ్బందుల్లో ఉన్న రైతులను ఆదుకోటానికి ముఖ్యమంత్రి అన్ని రకాల చర్యలు తీసుకొంటారని అభయం ఇచ్చారు. సాధారణంగా 30శాతం పైపడి పంట దెబ్బతింటే పరిహారానికి అర్హత ఉంటుందని, ఐదే ఇక్కడ వందశాతం పంట దెబ్బతిందన్నారు. కనీసం గడ్డి కూడా పశుగ్రాసానికి పనికి రాకుండా పోయిందన్నారు. జరిగిన నష్టంపై ఈ రోజే అధికారుల ద్వారా ప్రాథమిక నివేదిక ఉన్నతాధికారులు, కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. అదే విధంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి వర్యులు అచ్చెన్నాయుడుకు వివరిస్తానని హామీ ఇచ్చారు. అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లి నష్టపోయిన రైతులందరికి న్యాయం జరిగేలా చేస్తామన్నారు. కౌలు రైతులు కూడా ఎలాంటి బాధపడొద్దని, మీకు ప్రభుత్వానికి తాను అనుసంధానకర్తగా పని చేస్తానని నమ్మకం కల్పించారు. తనపై విశ్వాసంతో ఎన్నుకున్న రైతులకు కష్ట కాలం వచ్చినప్పుడు తప్పకుండా అండగా నిలుస్తానన్నారు. వీలైనంత తొందరంగా పరిహారం అందేలా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పంట పొలాల సందర్శనలో ఎమ్మెల్యేతో పాటు రెవెన్యూ అధికారులు, ప్రాజెక్ట్ వైస్ ఛైర్మెన్ కేశవరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ బలరామిరెడ్డి, విండో మాజీ అధ్యక్షులు కొత్తపల్లి మల్లికార్జున, టిడిపి నాయకులు పయ్యావుల అనిల్, పయ్యావుల మోహన్, ముల్లంగి నారాయణస్వామి, సొల్లాపురం బాబు తదితరులు పాల్గొన్నారు.

# బడుగులకు కష్టం ఉందంటే మొదట స్పందించేది ముఖ్యమంత్రి చంద్రబాబే

**- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత - 3మండలాలకు చెందిన 23మందికి రూ.9.66లక్షల చెక్కుల పంపిణీ**

**- మహాత్మా జ్యోతిబా పూలేకు ఘనంగా నివాళులర్పించిన సునీత - పూలే ఆశయాలు తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం**




జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే సునీత తదితరులు, సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యం

**అనంతపురం, ఏప్రిల్ 11 ప్రభాతవార్త బ్యూరో**

బడుగు, బలహీన వర్గాలకు, మహిళలకు కష్టం ఉందంటే మొదట స్పందించేది ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రమేనని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. శుక్రవారం రాప్తాడు నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన 23మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఇందులో అనంతపురం రూరల్, ఆత్మకూరు, రాప్తాడు మండలాలలోని వారికి రూ.9లక్షల 66వేల 784 సాయం అందించారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మూడు మండలాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న వారు ఎమ్మెల్యే సునీతకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు మహాత్మా జ్యోతిబా పూలే 199వ జయంతి కార్యక్రమాన్ని తన క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సునీత పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ పూలే అంటరానితనం, కుల వివక్ష అనే రుగ్మతలతో పాటు స్త్రీలకు కూడా విద్యఅవసరం అని మొట్టమొదట చెప్పింది పూలేనన్నారు. ఆయన చేసిన పోరాటాలు ఎంతో మందికి ప్రేరణగా నిలిచాయన్నారు. అందరికీ సమాన హక్కులు ఉండాలన్న పూలే ఆశయాలే టీడీపీకి సిద్ధాంతాలుగా మారాయన్నారు. ఈ రోజు ఎంతో మంది బడుగు, బలహీన వర్గాలవారు, మహిళలు చట్ట సభలకు వెళ్తున్నారంటే ఆ నాడు ఎన్టీఆర్ ఇచ్చిన అవకాశాల వలనేన్నారు. పూలే, ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పని చేస్తున్నారన్నారు. ఈ రోజు పేదలు ఏ కష్టంలో ఉన్నా.. ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందిస్తున్నారన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ వర్తించక ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారిని సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నారని ఎమ్మెల్యే సునీత అన్నారు. ఇప్పటికే రాప్తాడు నియోజకవర్గానికి ఎంతో పెద్ద ఎత్తున సాయం చేశారన్నారు. ముఖ్యమంత్రి చేస్తున్న ఈ సాయానికి నియోజకవర్గ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

# నిర్దిష్ట కాలపరిమితితో భూ సమస్యలు పరిష్కరించండి

**- ప్రజల సంతృప్తిస్థాయి పెంచండి - జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్**





అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ , హాజరైన సంబంధిత శాఖల అధికారులు

**శ్రీసత్యసాయి జిల్లా, ఏప్రిల్ 11, ప్రభాతవార్త ప్రతినిధి:**

ఒక నిర్దిష్ట కాల పరిమితిని నిర్దేశించుకుని సమయంలో వీలైనంతవరకు భూ సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో రెవెన్యూ సేవలపై జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డి ఆర్ ఒ విజయసారథి, ఎస్ డి సి సూర్యనారాయణ రెడ్డి లతో కలిసి రెవిన్యూ డివిజన్ అధికారులు, తాసిల్దారులు, సర్వే అధికారులతో సమావేశం నిర్వహించి ఆదేశాలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా పిజిఆర్ఎస్, రెవెన్యూ అంశాలు,రీ సర్వే, ఆర్ఒఆర్ కేసుల నమోదు వాటి పరిష్కారం, మ్యూటేషన్ ఆడిట్, అసైన్మెంట్ భూముల సమస్యలు, సర్వేయర్ల శిక్షణ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఏ లోపు వెళ్లకుండా గడువులోపు నాణ్యతగా పరిష్కరించేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ కమిషన్, లోకాయుక్త, సీఎం పేషీ తదితర వాటి నుంచి వచ్చిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సమస్యలపరిష్కారానికి కృషి చేయాలన్నారు. అలాగే రెవెన్యూ సమస్యలను నాణ్యతగా పరిష్కారం చేయాలని రీ సర్వే ప్రక్రియలో పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. భూమి అప్పగింత,అసైన్మెంట్ ల్యాండ్ మరియుఇనాం, ఎస్టేట్, ఆర్ఒఆర్ వెబ్ ల్యాండ్ సమస్యలు ఈ సమస్యలు సిటిజన్స్ సర్వీస్ లు, పిజిఆర్ఎస్ పరిష్కారం పై ప్రత్యేక దృష్టిని సారించాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తులను మరియు సమస్యలను పెండింగ్ లేకుండా సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పి-4 సర్వే కి సంబంధించి పనులను మొబైల్ యాప్ లో సంబంధిత అధికారులు అప్లోడ్ చేయాలని, ఫ్రీ హోల్డ్ రెండవ విడత రిసర్వే పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, మిగతా 4 లో...

# అధికారుల నిర్లక్ష్యం...రూ.1.66 కోట్లు నిధులు వెనక్కి...!

**- నిధులు మంజూరు చేసినా సకాలంలో ఖర్చు చేయని వైనం - ఇది అనంతపురం జిల్లా సమగ్రశిక్షలోని పరిస్థితి**

**అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 11 ప్రభాతవార్త**

సమగ్రశిక్ష అధికారుల నిర్లక్ష్యం వలన రూ.1.66 కోట్లు నిధులు వెనక్కి వెళ్ళింది. ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేసిన నిధులను సకాలంలో ఖర్చు చేయకపోవడం గమనార్హం.

అనంతపురం జిల్లా సమగ్రశిక్షలో అమలవుతున్న కేజీబీవీల నిర్వహణ, వివిధ పథకాలు, కార్యక్రమాలు, నిర్మాణాలు, ట్రైనింగ్, ఉద్యోగుల జీతాలు కోసం 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ.81,95,35,029 నిధులను మంజూరు చేసింది. ఈ నిధులను ఏప్రిల్ నుండి మార్చి ఆఖర్లోపు ఖర్చు చేయాల్సివుంది. అయితే మంజూరైన నిధులను మార్చి ఆఖర్ నాటికి కేవలం రూ.80,28,59,396 మాత్రమే ఖర్చు చేశారు. మిగిలిన రూ.1,67,54,240 నిధులు ప్రభుత్వానికి వెనక్కి వెళ్ళింది.

**నిధులు వెనక్కి వెళ్లడానికి పలు కారణాలు :** సమగ్రశిక్ష రెగ్యులర్ ఏపీసీగా పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ వరప్రసాద్‌రావు మేలో పదవీ విరమణ పొందారు. తర్వాత కొన్ని రోజులకు అప్పటి జెడ్పీ సీఈవో మైఖోమ్ నదియా ఐఏఎస్ కు ఏపీసీగా బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత కొన్ని రోజులకు ఏడీ నాగరాజుకు ఏపీసీ (ఎఫ్ఏసీ)గా గత జూలై ఆఖర్లో బాధ్యతలు అప్పగించారు. ఆతర్వాత ఆయన డిసెంబర్‌లో రాష్ట్రవిద్యాశాఖ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆ తర్వాత డీఈవో ఎం.ప్రసాద్ బాబు కొన్ని రోజులు ఏపీసీగా కొనసాగారు. ఆతర్వాత డ్వామా జిల్లా కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎంపీడీవో టి.శైలజ జనవరి 17వ తేదీ ఏపీసీగా బాధ్యతలు స్వీకరించారు. ఇలా ఒకే ఆర్థిక సంవత్సరంలో ఐదుగురు అధికారులు ఏపీసీలుగా మారడం... ప్రస్తుతం ఏపీసీగా పనిచేస్తున్న అధికారిణికి విద్యాశాఖ-సమగ్రశిక్షపై సరిగ్గా అవగాహన లేకపోవడం తదితర కారణాల వలన రూ.1,67,54,240 నిధులు వెనక్కి వెళ్లిపోయిందని విద్యాశాఖ, సమగ్రశిక్షలోని పలువురు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

**బడ్జెట్ వెనక్కి వెళ్ళిన మాట వాస్తవమే : సమగ్రశిక్ష డీపీసీ కె.ప్రసాద్ బాబు :** అనంతపురం జిల్లా సమగ్రశిక్షకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.81,95,35,029 నిధులు మంజూరైంది. అందులో మార్చి నాటికి రూ.80,28,59,396 ఖర్చు చేశాము. మిగిలిన రూ.1,67,54,240 నిధులు ఖర్చు చేయకపోవడంతో ప్రభుత్వానికి వెనక్కి వెళ్లిపోయింది. నూతన ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం మంజూరు చేసే నిధులు మొత్తాన్ని సకాలంలో ఖర్చు చేయడానికి చర్యలు తీసుకుంటాం.

# మహాత్మ జ్యోతిబా పూలే ఆశయాలను కొనసాగించాలి

**- రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్**




జ్యోతిబాపూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి, ఎంపి, ఎమ్మెల్యేలు ,జ్యోతిబాపూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి, ఎంపి, ఎమ్మెల్యేలు

**అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 11 ప్రభాతవార్త**

మహాత్మ జ్యోతిబా పూలే ఆశయాలను కొనసాగించాలని రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. జ్యోతిబాపూలే 199వ జయంతి వేడుకల సందర్భంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని జిల్లా పరిషత్ ఆవరణంలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, మడకశిర ఎమ్మెల్యే, టిటిడి సభ్యులు ఎంఎస్.రాజు, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన చిత్రపటానికి కూడా పూలమాలలు వేసి మంత్రి, ఎంపీ, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నేడు మహాత్మ జ్యోతిబా పూలే జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరుపుతోందన్నారు. మహారాష్ట్రలో జన్మించినా దేశానికే ఒక ఆదర్శంగా నిలిచినటువంటి వ్యక్తి జ్యోతిబా పూలే అన్నారు. సమాజంలో అట్టడుగు వర్గాలు, బలహీన, వెనుకబడిన వర్గాలు, నిమ్న జాతుల ఉద్ధరణ కోసం పనిచేసిన వ్యక్తి అని మంత్రి కొనియాడారు. అసామాన్యుడిగా జన్మించినా సామాజిక విప్లవానికి నాంది పలికినటువంటి వ్యక్తి అన్నారు. ఆనాటి డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ని ప్రభావితం చేసినటువంటి వ్యక్తి జ్యోతిబాపూలే అని, మిగతా 4 లో...

# అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని ధారపోసిన మహనీయుడు మహాత్మ జ్యోతిబా పూలే

**- అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మినారాయణ - పూలే బాటలో మనమందరం పయనించాలి : జిల్లా కలెక్టర్**

**అనంతపురం కలెక్టరేట్, ఏప్రిల్ 11 ప్రభాతవార్త**



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎంపి, కలెక్టర్ ఇతర అధికారులు

అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని ధారపోసిన మహనీయుడు, మహాత్మ జ్యోతిబా పూలే అడుగుజాడలే స్ఫూర్తిగా పయనించాలని అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మినారా యణ పేర్కొన్నారు. శుక్రవారం అనంతపు రం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో మహాత్మ జ్యోతిబా పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా పూలే చిత్రపటానికి పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మినారాయణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆర్‌డిఓ ఏ.మలోల అధికారులు, వివిధ బిసి సంఘ నాయకులు, ప్రతినిధులు జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలలు, పుష్పాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మినారాయణ మాట్లాడుతూ.. మహిళలు చదువుకుంటే వారికుటుంబము బాగుం టుందని, సమాజం, దేశం బాగుంటుందని, అప్పటిలోనే స్త్రీ విద్య అవసరాన్ని గుర్తించి మహిళల కోసం ఓ ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేశారని తెలిపారు. అంతేకాకుండా వారి శ్రీమతి సావిత్రిబాయి పూలేకు విద్య నేర్పించి, వారిని ఆ పాఠశాలలో ఉపాధ్యాయురాలినిగా చేసిన మహనీయుడని అన్నారు. ఈ భారతదేశం లో మహాత్మా అని ఇద్దరినీ అంటారని, ఒకడు మహాత్మా గాంధీ అయితే మరొకరు మహాత్మ జ్యోతిబాపూలే మాత్రమే అని అన్నారు. సామాజిక సంస్కరణలు, మానవ హక్కులు, సమ సమాజ స్థాపన, మహిళల విద్యాభివృద్ధికి నాంది పలికిన మహాత్ముడని అన్నారు. వారి ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం మనపై ఉందని తెలిపారు. వెనుకబడిన తరగతుల వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలను, అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టుతున్నదని వీటన్నింటిని ఉపయోగించుకుని బీసీ వర్గాల ప్రజలు మరింత అభివృద్ధి సాధించే దిశగా కృషి చేయాలని వాటిని వినియోగించుకోవాలని తెలిపారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మహాత్మ జ్యోతిబా పూలే సామాజిక సంస్కరణల నాంది పలికి, సామాజిక అసమానతల మీద పోరాటం చేసి మహాత్మా అని పేరు పొందినటువంటి మహనుభావుడన్నారు. రాష్ట్ర ప్రభు త్వం మహాత్మ జ్యోతిబా పూలే జయంతిని అధికారికంగా జరుపు కోవాలని ఆదేశించారని, మహాత్మ జ్యోతిబా పూలే ఆదర్శ బాటలో మనమందరము నడవాలన్నారు. జిల్లాలో అక్షరాస్య తపెరగాలని, ఆడపిల్లలు బాగా చదువుకోవాలని, వారికి కావాల్సిన అన్ని సదుపాయాలను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. మహాత్మ జ్యోతిబా పూలే జయంతిని పురస్కరిం చుకొని ఈ రోజు నరాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరంలో అనంతపురం జిల్లాలో స్వయం ఉపాధి పథకం ద్వారా అర్హులైన 477 మంది లబ్ధిదారులకు రూ.11.61 కోట్ల మెగా చెక్‌ను అందించే కార్యక్రమాలను చేపట్టుతు న్నదని అన్నారు. అన్ని మండలాలు, మున్సిపల్ కార్పొరేషన్ లలో లబ్ధిదారులను ఎంపిక చేసి వీరికి అందజేయడం జరుగుతుందన్నారు. ప్రజ లందరూ ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలో తెలియజేయ డం జరుగుతుందని, దీనిని వెనకబడిన వర్గాల ప్రజలు అందరూ ఉపయోగిం చుకునే విధంగా ఇప్పటివరకు లబ్ధి చేకూరాలని కుటుంబాలకు దీనిని పొందాలని అన్ని కుటుంబాలు బాగు కావాలని ఈ ప్రభుత్వం ఆశిస్తున్నదని తెలిపారు. అనంతపురంలో వేసవికాలంలో వివిధ ఇంజనీ రింగ్ పనులు రోడ్లు, వంతెనలు, వాటర్ ట్యాంకు లు, వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతున్నదని అన్నారు. అనంతపురం జిల్లాలో పార్లమెంటు సభ్యులు జిల్లాకి మంచి చేయాలని ఉద్దేశంతో అధికారులను, వివిధ సంస్థలను కలిసి అభివృద్ధి బాటకు కృషి చేస్తున్నారన్నారు. ఈ మధ్యనే జిజిహెచ్‌లో అనంత మదర్స్ మిల్క్ బ్యాంకు ప్రారంభించడం జరిగిందని, ఎంపీనిధుల నుండి 12 లక్షలు నిధులను మంజూరుచేసి ఏర్పాటుకు కృషి చేశారని, ఇలాంటి మదర్ మిల్క్ బ్యాంకులు హైదరాబాదు, తిరుపతి తర్వాత అనం తపురంలో ఏర్పాటు చేసుకున్నందుకు మనమంతా గర్వించదగ్గ విషయమని అన్నారు. వెనుకబడిన తరగతుల వారికి ఈ ప్రభుత్వం అందరి భాగస్వామ్యంతో మీరు చేసే విధంగా కృషి చేస్తున్నదని తెలిపారు. సమావేశంలో వాల్మీకి వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంకె ఈశ్వరయ్య, నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మంగళ ఆదినారాయణ, రజిక వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, వివిధ బీసీ సంఘాల నాయకులు, ప్రతిని ధులు మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలను, ఆదర్శాలను వివరించారు. అనంతరం బిసి కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి నిమిత్తం 477 మంది లబ్ధిదారులకు 4 కోట్ల 77 లక్షల సబ్సిడీ, 6 కోట్ల 84 లక్షలు బ్యాంకులోను మొత్తము రూ.11.61 కోట్లు మెగా చెక్కును పార్లమెంటు సభ్యులు, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా లబ్ధిదా రులకు అందజేశారు. ఈ సందర్భంగా యోగ, వివిధ సాంస్క ృతిక నృత్య ప్రదర్శనలను చేసిన విద్యార్థినీలకు అనంతపురం పార్లమెంటు సభ్యులు, జిల్లా కలెక్టర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, రామ్మోహన్, సోషల్ వెల్ఫేర్ జెడి రాధిక, జిల్లా పరిషత్ సీఈవో రామచంద్ర రెడ్డి, బీసీ వెల్ఫేర్ డిడి ఖుష్బూ కొఠారి, డిటిడబ్ల్యువో రామాంజనేయులు, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ రామసుబ్బారెడ్డి, బిసి కార్పొరేషన్ డిడి సుబ్రమణ్యం వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్లు సుభాషిని, రంగమ్మ, గంగాద్రి, బీసీ హాస్టల్స్ వార్డెన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మస్తాన్, రాజశేఖర్‌నాయుడు, జిల్లా అధ్యక్షులు మారుతి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరన్న, కోశాధికారి ఠాగూర్, వివిధ బీసీ సంఘాల నాయకులు, ప్రతినిధులు, బీసీ హాస్టల్స్ వార్డెన్లు, జిల్లా కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా పొట్టేలు, మేకలు, గొర్రెలు, పెంపకంపై రైతన్నలు ఆసక్తి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటస్వామి



వెంకట్‌స్వామి

**అనంతపురం వ్యవసాయం, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:**

తీవ్ర కరువు పరిస్థితుల్లో ఉన్నటువంటి అనంతపురం జిల్లా వ్యాప్తంగా అనేక మంది రైతన్నలు వ్యవసాయంతో పాటు ప్రత్యామ్నయంగా నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా పొట్టేలు, గొర్రెలు, మేకలు పెంపకంపై దృష్టి పెట్టారని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి వెంటకస్వామి ప్రభాతవార్తతో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అనేక మంది రైతులు ఎమ్మెల్యే స్కీం కింద ఆన్లైన్లో దరఖాస్తు చేసుకుంటున్నారని తెలియజేశారు. ఇలా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య రోజుకి పెరుగుతుండడంతో రైతులు ఎన్ఎల్ఎం స్కీం పై దృష్టి సాధిస్తున్నారని తెలియజేశారు. పొట్టేలు పెంపకంకు సంబంధించి 20లక్షలఉ ,40లక్షలు, 60లక్షలు కోటి రూపాయలు ఇలా వివిధ రకాల స్కీమ్లో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకుంటున్నారని వివరించారు. ఇప్పటికే జిల్లాలోని గుత్తి ఒక యూనిట్, ఉరవకొండ రెండు యూనిట్లు, కూడేరు రెండు యూనిట్లు, ఎన్ఎల్ఎం స్కీం కింద పొట్టేలు ఫారాలు ఏర్పాటు చేశారని, ఇంకా 14ప్రాంతాల్లో నిర్మాణ దశలో ఉన్నాయని, ఏడు ప్రారంభ దశలో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఎన్ఎల్ఎం స్కీంల ద్వారా పొట్టేలు పెంపకం సక్రమంగా నిర్వహించుకుంటే రైతన్నలు మంచి లాబాదాయకంగా ఉంటుందని వివరించారు. కరువు జిల్లా అయిన అనంతపురంలో రైతన్నల్లో ఎన్ఎల్ఎం స్కీమ్‌లకు ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన మినీ గోకులాలు మన జిల్లాకు 1824యూనిట్లు మంజూరు కగా ఇప్పటివరకు 175యూనిట్లో ప్రారంభ దశకు చేరుకున్నాయని తెలియజేశారు. త్వరలో మరిన్ని మినీ గోకులాలు మన జిల్లాకు మంజూరు కానున్నాయని త్వరలో తెలియజేస్తానని అన్నారు.




## బిజెపి కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు

రాయదుర్గం, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:



జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, బిజెపి నాయకులు

పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న భారతీయ జనతాపార్టీ కార్యాలయంలో శుక్రవారం 198వ మహాత్మా జ్యోతి బాపూలే జయంతి వేడుకలను బిజెపి నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు వడ్డే అంబాజీరావు తదితరులు మహాత్మా జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పిస్తూ శతకోటి వందనాలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జ్యోతి బాపూలే సమాజంలో పీడిత వర్గాల అభివృద్ధి కోసం బాలికల విద్యాభ్యాసం కోసం, మహిళ సాధికారత కోసం, కృషి చేయడంతో పాటు జీవితాన్ని ధారబోసిన మహనీయుడు మహాత్మా జ్యోతిపూలే అన్నారు. మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేది విద్యఒక్కటే అని మనుషులలో పుట్టుకతో స్వాతంత్రులు పురుషులు స్త్రీలు అని బేదం ఎక్కడ ఉండకూదన్నారు. మగవారితో పాటు ఆడవారికి అన్ని హక్కులు సమానంగా ఉండాలని, దశాబ్దాల క్రితమే బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగు నింపిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ ఎం.శివశంకర్, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, పూజారి నాగరాజు, కంబ్లి, శంకర్ ముదిగల్, శంకర్, ఆంజినేయులు, శివానంద, శ్రీధర్, బొమ్మనహాళ్ యువజన నాయకుడు ఎర్రిస్వామి, వద్రవన్నూర్ రామచంద్రప్ప, వీరాపురం వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలేకి ఘనమైన నివాళులు

డి.హీరేహాళ్, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:



జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు.

మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మహాత్మ జ్యోతి రావు పూలే 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలోని సతారా జిల్లాలో వారు జన్మించారన్నారు. నవభారత నిర్మాణానికి, నాంది పలికిన సామాజిక విప్లవ పోరాట యోధుడు మహాత్మ జ్యోతిరావుపూలే అన్నారు. అణగారిన వర్గాల వారి అభ్యున్నతి కోసం నిరంతరం పరితపించిన మహనీయుడు మహాత్మ జ్యోతి రావుపూలే అని ఆయనసేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ జిల్లా అధ్యక్షులు హరిగోపాల్ మది, ఏపిటిఎఫ్ నాయకులు జాఫర్, దేవరాజ్, ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షుడు శివరాజు, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్, మండల నాయకులు రఘవేంద్ర, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, ఎంఈఎఫ్ నాయకులు హెచ్.ఎం.ముక్కన్న, హనుమంతు, నరసింహులు, యువసేన నాయకులు సవారప్ప తదితరులు పాల్గొన్నారు.

## గృహ ప్రవేశంకు హాజరైన ఎంపిపి

డి.హీరేహాళ్, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:



బోయ వెంకటేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపిపి

కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి పట్టణంలో చిరంజీవి పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బోయ వెంకటేష్ నూతన గృహ ప్రవేశానికి ఎంపిపి బోయ పవిత్ర వన్నూరుస్వామి పాల్గొన్నారు. నూతన గృహంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో వారు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం వారి ఆథిత్యంను స్వీకరించారు.

## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

రాయదుర్గం, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు.

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్.. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల నుండి ర్యాలీ నిర్వహించి లక్ష్మీబజార్, పాతబస్టాండ్, వినాయక కూడలి వరకు నిర్వహించారు. అనంతరం వినాయక కూడలిలో మానవహారం ఏర్పడ్డారు. అనంతరం కళాశాల ప్రధాన చార్యులు డాక్టర్ టి.విజయలక్ష్మి విద్యార్థులకు రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సమాజ సమానత్వానికి చేసిన కృషిని కొనియాడారు. మన బారత రాజ్యాంగం గురించి కూడా విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఓ ఏ.ఎర్రన్న, బి.ఆక్కులరెడ్డి, కళాశాల సీనియర్ అధ్యాపకులు కే.వీరేష్, ఎస్.ఆదిల్‌బాష, యు. గంగాధర్, టిసి.నరసింహులు, కే.వెంకటేశులు, బిజీ రూపపతి, జి.అరుణమ్మ, జి.ఓబులేష్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ నూతన ఏపీఓగా శ్రీదేవి బాధ్యతలు

కంబదూరు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త



ఏపీఓ శ్రీదేవి

కంబదూరు మండలం ఉపాధి హామీ పథకం నూతన ఏపీఓ గా శ్రీదేవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు . గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సుజాత శింగనమలకు బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో శింగనమల మండలం నుండి బదిలీపై శ్రీదేవి కంబదూరు మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ సిబ్బంది ఆమెకు స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నూతన ఏపీవో శ్రీదేవి మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పిస్తామని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన రోజువారి కూలీ వేతనాల గూర్చి కూలీలకు ఆహ్వానం కల్పిస్తామన్నారు. సిబ్బందికి, ఉపాధి కూలీలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## గ్రామాలకు బెంచీలు పంపిణీ

హిందూపురం టౌన్ ఏప్రిల్ 11 ప్రభాతవార్త



బెంచీలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవితమ్మ తన తండ్రి మాజీ మంత్రి రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం పరిగి మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం మంత్రి సవితమ్మ సౌజన్యంతో ఏర్పాటు చేసిన సిమెంటు బెంచీలను ఆయా గ్రామాలకు టిడిపి నాయకులు అందజేశారు. పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాలకు ఈ సిమెంట్ బెంచీలను త్వరలో అందజేయనున్నట్లు టిడిపి యువ నాయకుడు మారుతి, మండల కన్వీనర్ గోవిండ్ రెడీ లు తెలిపారు.

## వర్షబీభత్సం ఈదురుగాలులకు నేలకొరిగిన బొప్పాయి

### మొక్కలను పరిశీలిస్తున్న ఆర్డీవో

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 11 ప్రభాతవార్త



నేలకొరిగిన బొప్పాయి మొక్కలను పరిశీలిస్తున్న ఆర్డీవో వసంత బాబు టిడిపి నాయకులు దేవినేని అవినాష్

మండలంలోని తిమ్మనసముద్రం గ్రామం పంచాయితీ లోని బాల వెంకటాపురం గ్రామ రైతు అంతేష్ కి చెందిన బొప్పాయి చెట్లు గురువారం రోజున సాయంత్రం వానకు ఈదురు గాలులకు సుమారు 4000 మొక్కలు తిమ్మనసముద్రం పోలం నందు సర్వే నంబర్ 1971, 1972 నందు విస్తీర్ణం 4.01 ఏకరములు పంటా పడిపోవడం జరిగింది. తిమ్మసముద్రం గ్రామం వారు ఇచ్చిన సమాచారం మేరకు కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజనల్ అధికారి వసంత బాబు మరియు కళ్యాణదుర్ తహశీల్దార్ భాస్కర్ బొప్పాయి చెట్లు కూలిన పొలాన్ని సందర్శించి సదరు రైతు ధగ్గర నష్ట పరిహారం గురించి విచారించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దేవినేని అవినాష్ మండల అధ్యక్షులు గోళ్ళ వెంకటేశులు ఇతరులు పాల్గొన్నారు.

## 21న ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష

అమరాపురం ఏప్రిల్ 11 ప్రభాతవార్త

మండల కేంద్రమైన అమరాపురం ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల 2025 26 విద్యా సంవత్సరములో 6వ తరగతిలోనికి ప్రవేశము కొరకు ప్రవేశ పరీక్షతేదీ ఏప్రిల్ 20కి బదులు ఏప్రిల్21కి ప్రభుత్వం మార్చబడినట్లు ఆదర్శ పాఠశాలప్రిన్సిపాల్ జి.ఓబులపతి తెలిపారు. 202526 విద్యా సంవత్సరమునకు 6వతరగతిలో విద్యార్థులను చేర్చుకొనుటకై.20ఆదివారము రాష్ట్రవ్యాప్తముగా జరగబోవు ప్రవేశపరీక్ష ఈస్టర్‌పర్వదినం సందర్భంగా తేది.21.04.2025నకు మార్చబడినది. కావున ప్రవేశ పరీక్షతేదీని మార్పుని గమనించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఏప్రిల్ 21న ఉ.1000 గం.ల నుండి మ. 1200 గం. ల వరకు నిర్వహించబడే ప్రవేశ పరీక్షకు అమరాపురం మోడల్ స్కూల్ నందు హాజరుకావాలని తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్స్‌ని www.cse.ap.gov.in లేదా www.apms.apcfss.in వెబ్ సైట్స్ నుండి డౌన్లోడ్ చేసుకోగలరని తెలిపారు.

## పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని ఈ నెల 13న సంతకాల సేకరణ

గోరంట్ల, ఏప్రిల్ 11 ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని ఈ నెల 13 వతేదీ ఆదివారం గోరంట్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని మండల ప్రజలు జయప్రదం చేయాలని వారు శుక్రవారం పత్రికా ప్రకటన ద్వారా కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై భారం మోపిందన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలతో ప్రజలు సతమతమవుతున్నారన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఆర్థిక భారాలపై ప్రశ్నించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. ప్రజలపై ప్రభుత్వాలు మోపుతున్న ఆర్థిక భారాలు, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 13వతేదీన సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. మండలంలోని ప్రజలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ మండల ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత, సంఘీభావంగా భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు, స్థానిక ఇండ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు ఆంజనేయులు, హబీబ్, పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యాలయంలో ఘనంగా జ్యోతిబా పూలే జయంతి

### -సేవలను కొనియాడిన పంచాయతీ కార్యదర్శి ఏ.గౌస్‌సాహెబ్

ఉరవకొండ, ఏప్రిల్ 11 ప్రభాతవార్త

ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే 199వ జయంతిను ఘనంగా నిర్వహించారు. జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలవేసి పూజలు నిర్వహించిన అనంతరం పంచాయతీ కార్యదర్శి ఏ.గౌస్‌సాహెబ్ మాట్లాడుతూ జ్యోతిబా పూలే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, సమసమాజ నిర్మాణానికి చేసిన కృషి భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. కులపరమైన వివక్షత, అసమానతలను రూపుమాపడానికి తన జీవితాన్ని దారపోసిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు ముండాసు ఓబులేసు, వార్డు సభ్యులు పి.నిరంజన్‌గౌడ్, బీసీ నాయకులు ఎస్.అమర్నాధ్, పి.లెనిన్‌బాబు, పంచాయతీ కార్యాలయ సిబ్బంది సాయిప్రసాద్, నాగరాజు, రాజయ్య, అబూబాకర్, ప్రతాప్, అబ్దుల్, వన్నూరుసాబ్, శర్మస్‌వలి, గోపాల్, నాగరాజు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిబా పూలే చిత్రపటానికి పూజలు నిర్వహించి నివాళులర్పిస్తున్న పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, సిబ్బంది

## ఘనంగా మహాత్మ జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు

చిలమత్తూరు, ఏప్రిల్ 11 ప్రభాతవార్త



జ్యోతిరావుపూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

చిలమత్తూరు మండల కేంద్రంలోని గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ అధికారి ఆర్.మల్లికార్జున ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావుపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రంథాలయాధికారి మల్లికార్జున మాట్లాడుతూ కులం పేరుతో తరతరాలుగా అణచివేతకు గురవుతున్న బడుగు బలహీనవర్గాల ప్రజలకు తాను అండగా నిలిచాడన్నారు. అందరికీ చదువు ఎంతోఅవసరమని పాఠశాలలను రూపొందించారన్నారు. స్త్రీలకు ఆత్మస్థైర్యం కల్పించి వారి హక్కుల కోసం పోరాడి సాధికారత కల్పనకు కృషి చేసిన మహనీయుడని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు ఆదినారాయణప్ప, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## లేపాక్షిలో గర్భవతులకు పౌష్టికాహారం

లేపాక్షి, ఏప్రిల్ 11 ప్రభాతవార్త



గర్భవతులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

లేపాక్షి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్య పరీక్షలకు విచ్చేసిన దాదాపు 65 మంది గర్బవతులకు లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రామానందన్ పౌష్టికాహారం అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, వైద్య సిబ్బంది, గర్భవతులు, చైర్మన్ రామానందన్ మిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

## మెగా డిఎస్‌సి ఆన్‌లైన్ ఉచిత కోచింగ్‌కు 15లోపు దరఖాస్తు చేసుకోండి

లేపాక్షి, ఏప్రిల్ 11 ప్రభాతవార్త

వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మెగా డిఎస్‌సి పరీక్షలకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణకు ఈనెల 15 లోపు దరఖాస్తు చేసుకోవాలని సత్యసాయి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిక అధికారిణి నిర్మలజ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్‌లో అర్హత సాధించిన శ్రీసత్యసాయి జిల్లా వాసులు మాత్రమే ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు అర్హులన్నారు. వెనుకబడిన తరగతులు, ఇడబ్ల్యుఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ మార్కుల జాబితాలు జతపరచాలని పేర్కొన్నారు. మెగా డిఎస్‌సి ఆన్‌లైన్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకునేవారు టెట్ మార్కుల జాబితా, నేటివిటీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు జత చేసి ఈనెల 15వతేదీ లోపు శ్రీసత్యసాయి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిక కార్యాలయములో దరఖాస్తులను అందచేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9392141545 ఫోన్ ద్వారా గాని, నేరుగా గాని కార్యాలయం పనివేళల్లో సంప్రదించాలని ఆమె తెలియచేశారు.

## ఆరు వారాలైన కూలి ఇవ్వకపోతే కూలీల గతేంటి

### -కూలీలతో కలిసి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్

గోరంట్ల, ఏప్రిల్ 11 ప్రభాతవార్త



కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

గోరంట్ల మండలం వడిగేపల్లి గ్రామంలో ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రదేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న శుక్రవారం పర్యటించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు 6 వారాలు బకాయి వేతనాలు, పే స్లిప్పులు, మస్టర్లు అందుబాటులో లేవని, శ్రమశక్తి సంఘాలు ఏర్పాటు చేసి మేట్లను ఇంత వరకు ఏర్పాటు చేయలేదని సంఘం నాయకులకు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ ఉపాధి కూలీలు పస్తులు ఉండి పనులు చేస్తూ ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేరుస్తున్న కూలీల వేతనాలు చెల్లింపులు పనిముట్లు ఇవ్వకుండా వివక్ష చూపిస్తోందని విమర్శించారు. ఉపాధి కూలీలు ఆకలితో అలమటిస్తున్నా కూలీల పట్ల ప్రభుత్వానికి కనికరం లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీల వేతనాలు, పనిముట్లు, మస్టర్లు కూలీల ప్రాథమిక హక్కు. హక్కుల రక్షణ కోసం సంఘటితంగా పోరాడాలని సంఘం కూలీలకు అండగా వుంటుందని భవిష్యత్తులో వేతనాలు, పనిముట్లు కోసం ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో గెట్ మీట్

పుట్టపర్తి టౌన్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త

రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు పుట్టపర్తి ఆర్టీసీ డిపో నందు శుక్రవారం గేట్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ నాయకులు మాట్లాడుతూ సుమారు 38 డిమాండ్లతో కూడిన వినతి పత్రం మేనేజింగ్ డైరెక్టర్ గారికి సమర్పించడం జరిగిందని, కానీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో వారు పూర్తిగా విఫలమయ్యారన్నారు. అక్రమ రీమివల్స్ ఆపి కేంద్ర కార్యాలయం ఇచ్చిన సర్క్యులర్‌ను వెంటనే ఇంప్లిమెంట్‌చేయాలని, గత నాలుగేళ్లుగా నిలిచిపోయిన పదోన్నతులను వెంటనే ఇవ్వాలని, అన్ని కేటగిరీలలో ఖాళీలను భర్తీ చేయాలని, ఆర్టీసీ ఉద్యోగులు అనారోగ్యానికి గురైతే సిక్కు కాలానికి జీతాలు ఇవ్వాలని, ఈ హెచ్ ఎస్ స్థానంలో ఆర్టీసీ లో ఉన్న పాత వైద్య విధానాన్ని అమలు చేయాలని, విద్యుత్ బస్సులను సంస్థ లేదంటే ప్రభుత్వం ద్వారానే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరి నైట్ అవుట్ ఆల్వేన్‌లను 150రూపాయలునుంచి 300 రూపాయలకు పెంచాలని, ప్రభుత్వ జీవో ప్రకారం మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని ,గ్యారేజ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ నాయక్, కార్యదర్శి షబ్బీర్, రీజినల్ ఉపాధ్యక్షుడు బాబ్జాన్, రవితేజ, చెనరాయుడు, అప్పిరెడ్డి, గాయాజ్‌భాష,ఈశ్వరయ్య,గంగులయ్య, లక్ష్మీపతి, విజయలక్ష్మి, శివారెడ్డి, శివశంకర్, ప్రశాంతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## సర్వేలు వేగవంతం చేయండి. ఎంపి డి ఓ నంద కిషోర్.

బ్రహ్మ సముద్ర, ఏప్రిల్ 11 ప్రభాతవార్త



బ్రహ్మ సముద్రం మండల పరిధిలోని పాలవెంకటాపురం సచివాలయం ను ఎంపి డి ఓ నంద కిషోర్ అకస్మిక తనిఖీ నిర్వహించారు .రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచిస్తూ ప్రభుత్వం ఆదేశించిన సర్వేలను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు.

← రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

## ఘనంగా మహాత్మ జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు

గుత్తి, ఏప్రిల్ 11 ప్రభాతవార్త



పూలే విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న టిడిపి నాయకులు

గుత్తి పట్టణంలో మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వ ర్యంలో పత్తికొండ రోడ్డు లో వున్న జ్యోతిరా వుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూటమి ఆధ్వర్యంలో టిడిపి కన్వీనర్లు ఎన్‌కె చౌదరి, బద్రివలి ఆధ్వర్యంలో నాయకులు పూలే విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘనం గా నివాళులు అర్పించారు. అలాగే వైకాపా జిల్లా ఉపాధ్యక్షులు నైరుతిరెడ్డి, వైకాపా నేతలు మధుసూదన్‌రెడ్డి, వాసిమ్ సన్‌వీరా, రంగస్వామి, గంగరాజు, గోవర్ధన్‌రెడ్డి తదితరులు నివాళులు అర్పించారు. అదేవిధంగా జెవివి జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. పెన్షనర్ల కార్యాలయంలో అబూబకర్, కుళ్లాయిబాబు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. అలాగే ఏపిటిఎఫ్ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.



పూలే విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న వైసిపి నాయకులు

## ఘనంగా పౌష్టికాహార పక్షోత్సవాలు

గుత్తి, ఏప్రిల్ 11 ప్రభాతవార్త




అవగాహన కల్పిస్తున్న దృశ్యం

స్త్రీశిశు సంక్షేమ శాఖ గుత్తి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం పలు అంగన్‌వాడి కేంద్రాల్లో సిడిపిఓ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాలను ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నాగేశ్వరి మాట్లాడుతూ గర్భవతులు తమ ఆరోగ్య దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బిడ్డకు రెండు సంవత్సరాల వయసు వచ్చేంతవరకు తీసుకోవాల్సిన సంరక్షణ గురించి ఆమె అవగాహన కల్పించారు.

## ఐఒసి డిపో మేనేజర్‌గా హరీష్‌కుమార్‌రెడ్డి

గుంతకల్లు, ఏప్రిల్ 11 ప్రభాతవార్త



బాధ్యతలు స్వీకరిస్తున్న హరీష్‌కుమార్

గుంతకల్లు మండలంలోని నక్కనదొడ్డి గ్రామ పంచాయతీలో వున్న ఐఒసి డిపో నూతన మేనేజర్‌గా హరీష్‌కుమార్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడలో పనిచేస్తున్న ఈయన ఇక్కడికి రాగా, ఇక్కడ చీఫ్ మేనేజర్‌గా పనిచేస్తున్న నవీన్‌కుమార్ చెన్నైకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులు, ఉద్యోగులు, యూనియన్ కార్యదర్శి ఖలీల్‌బాష, జిప నజీర్‌లు ఆయనకు పుష్పగుచ్చాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

## వెంకటరెడ్డి-నిర్మలమ్మల అకౌంట్ నుంచి పెద్ద మొత్తంలో నగదు చోరీ

బెలుగుప్ప, ఏప్రిల్ 11 ప్రభాతవార్త

బెలుగుప్ప మండల కేంద్రంలో నివాసం ఉంటున్న వెంకటరెడ్డి-నిర్మలమ్మలు నివాసం ఉంటున్నారు. నిర్మలమ్మ అకౌంట్‌లో ఉన్న నగదులో రూ.99,640లు అకౌంట్ నుంచి చోరీకి గురయ్యాయని నిర్మలమ్మ, వెంకటరెడ్డి దంపతులు శుక్రవారం బెలుగుప్ప పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శివకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఎస్‌బిఐ వివరాలను మీడియాకు వెల్లడించారు. వెంటనే ఎస్‌బిఐ మేనేజర్ వద్దకు వెళ్లి బ్యాంక్ అకౌంట్ నుంచి పెద్ద మొత్తంలో గుర్తు తెలియని వ్యక్తులు అకౌంట్ నుంచి డబ్బులు చోరీ చేశారని, ఎలా జరిగి ఉంటుందని బ్యాంక్ మేనేజర్‌తో వివరాలను కన్నుకున్నారు. మేనేజర్ తెలియజేస్తూ.. మీ అకౌంట్‌కు సంబంధించి చోరీకి గురైన నగదు పంజాబ్ నేషనల్ బ్యాంకుకు ట్రాఫర్ అయినట్లు గుర్తించామని త్వరలోనే అందుకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తామని బ్యాంకు మేనేజర్ తెలియజేశారు.

## అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలు

బెలుగుప్ప, ఏప్రిల్ 11 ప్రభాతవార్త



బెలుగుప్ప మండల కేంద్రంలో గురువారం రాత్రి కురిసిన వర్షాలకు పూర్తిగా పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో నర్సాపురం, రవనేపల్లి, బెలుగుప్ప, ఎలగలవంక, గంగవరం, దుద్దేకుంట గ్రామాల్లో అరటి, బొప్పాయి, మొక్కజొన్న పంటలు పూర్తిగా నష్టపోయామని రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికొచ్చిన పంటలు ఇలా అకాల వర్షాలకు నేలపాలయ్యాయన్నారు. అందులో భాగంగా 150 ఎకరాల మొక్కజొన్న, 10 ఎకరాల అరటి, 4 ఎకరాల బొప్పాయి పంటలు పూర్తిగా దెబ్బతిన్నందు వల్ల మండల వ్యవసాయ అధికారి ఆ పంటలపై ఎంత నష్ట పోయిందని ఉన్నతాధికారులకు తెలియజేసి నష్ట పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు.



అకాల వర్షానికి నష్టపోయిన మొక్కజొన్న, బొప్పాయి, అరటి పంటలు

## ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాలలో రెండు రోజుల కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ జాతీయ కాన్ఫరెన్స్

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 11 ప్రభాతవార్త

స్థానిక ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాలలో రెండు రోజుల జాతీయ కాన్ఫరెన్స్ " బిజినెస్ ఎడ్యుకేషన్ ఇన్ డిజిటల్ ఎరా-ఎమెర్జింగ్ ఇష్యూస్ అండ్ ఛాలెంజెస్ అహెడ్ " మీద కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మొదటి రోజు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కళాశాల వైస్ ఛైర్మన్ సి.చక్రధర రెడ్డి మాట్లాడుతూ..ప్రస్తుత వ్యాపార రంగంలో డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఎస్కె యూనివర్సిటీ రిజిస్టర్ డా.రమేష్‌బాబు మాట్లా డుతూ.. ఈ డిజిటల్ యుగంలో మారుతున్నటువంటి మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ ఆలోచనలకూ పదును పెట్టి అభివృద్ధి వైపు అడుగులు వేయాలని సూచించారు.

కీనోట్ స్పీకర్ ప్రొఫెసర్ బి.రాజశేఖర్, సీనియర్ ప్రొఫెసర్, ఫార్మర్ ప్రో వైస్ ఛాన్సులర్ సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైద రాబాద్ ప్రసంగిస్తూ.. ఈ పోటీ ప్రపంచంలో విద్యార్థులు విజయాన్ని సాధించే ప్రక్రియలో సాంకేతికత అనేది కీలక భూమిక పోషిస్తుందని సభ ముఖంగా తెలియజేశారు. ఈ డిజిటల్ యుగంలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు వ్యాపార నైపుణ్యాలను ఎలా మెరుగు పరచుకోవాలో తెలియ జేసి ఉద్యోగ అవకాశాలు ఎలా ఉన్నా యనేది కూడా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నటువంటి. కేంద్రీయ విశ్వవిద్యాలయం అసో సియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రంగ నాథం ప్రసంగిస్తూ.. విద్యార్థులు విజయాన్ని సాధించడానికి కావలసిన మెళుకువలను క్లుప్తం గా వివరించారు. అసిస్టెంట్ ప్రొ ఫెసర్ డా.ఎన్.జయప్రద శ్రీ సత్య సాయి డీమ్డ్ యూనివర్సి టీసెషన్ చైర్‌గా వ్యవరించారు. బి.షర్మిల రామ య్య అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రభు త్వ ఆర్ట్స్ కళాశాల అనం తపురం సెషన్ రాపోర్టర్‌గా వ్యవ హరిం చారు. అలాగే సి.విశ్వ తేజ, టి.నాగలక్ష్మి సెషన్ రాపోర్టర్స్‌గా వ్యవరిం చారు. ఈ కార్యక్రమం లో డా.ఏవి.రమణ రిటైర్డ్ ప్రొఫె సర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ఎ.వి.ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డా.టి.శ్రీనివాసులు, ఏవో శ్రీనాథ్, కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.టి. వినయ్ కుమార్, ఆర్గనైజింగ్ కమిటీ మెంబెర్స్, ఇతర కళాశాల అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్, వివిధ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అతిథులు

## మహాత్మా జ్యోతిబా పూలే నివాళులర్పించిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్‌బాబు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 11 ప్రభాతవార్త

భారతీయ సమాజంలో అంటరానితనానికి వ్యతిరేకంగా, కుల వ్యవస్థ నిర్మూలనకు, లింగ వివక్షకు వ్యతిరేకంగా, మహిళాభ్యుదయానికి, అణగారిన వర్గాల విద్యావ్యాప్తికి ఎనలేని కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త, మానవతా మూర్తి మహాత్మా జ్యోతిబాపూలే అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వీబీ.భాస్కరబాబు కొనియాడారు. శుక్రవారం పూలే జయంతి సందర్భంగా నగరంలోని జిల్లాపరిషత్ కార్యాలయ ఆవరణంలోని పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాస్కర్‌బాబు మా ట్లాడుతూ.. సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘ సేవకుడైన మహా త్మా పూలే సమాజంలో సగ భాగంగా ఉన్న స్త్రీలు అభివృద్ధి చెందక పోతే, సమాజం అభివృద్ధి చెందదని భావించి స్త్రీ విద్యను ప్రోత్సహిస్తూ అనేక పాఠశాలలను స్థాపించారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ నాగభూషణం, రాయలసీమ అధ్యక్షుడు న్యాయవాది చంద్రాచర్ల హరి, రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర గౌడ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి డీకే రామ లింగం, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ గౌడ్, జిల్లా యువజన అధ్యక్షుడు మనోజ్ కుమార్, జిల్లా విద్యార్థి అధ్య క్షుడు కేశ వ్ గౌడ్, జిల్లా విద్యార్థి నగర అధ్య క్షుడు భరత్ యాదవ్, జిల్లా యు వజన నాయకులు రాజశేఖర్, శోభన్‌బాబు, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న భాస్కర్‌బాబు, ఇతరులు

## వక్ఫ్ బోర్డు అమెండ్‌మెంట్ బిల్లు ఆమోదం సరైందికాదు

### - డిఆర్ఓ మలోలాకు వినతిపత్రం అందజేసిన యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 11 ప్రభాతవార్త

వక్ఫ్‌బోర్డు అమెండ్‌మెంట్ బిల్లు ఆమోదం సరైంది కాదని యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ సి.జాఫర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం జిల్లా కలెక్టరేట్‌లోని డిఆర్ఓ మలోలకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ సి.జాఫర్ మాట్లాడుతూ.. మేము భారత పౌరులుగా, ఇస్లాం, ఇస్లామిక్ చట్టంపై మా మత విశ్వాసం, విశ్వాసాన్ని ఆచరించే హక్కును భారత రాజ్యాంగం మాకు హామీ కల్పించిందన్నారు. భారతదేశంలోని బాధ్యతాయుతమైన ముస్లిం పౌరులుగా ప్రతిపాదిత ఎక్ఫ్ సవరణ యాక్టు గురించి పార్లమెంటరీ చర్చల తోపాటు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న అధికారిక వెర్షన్ నుంచి కొత్త నిబం ధనలను మేము జాగ్రత్తగా చదివి అర్థం చేసుకోవడం జరిగిందన్నారు. ఇస్లాం లో వక్ఫ్ ప్రాథమిక అంశాలపై లోతైన ఆలోచన తర్వాత, అన్ని కొత్త నిబంధనలు ఇస్లామిక్ వక్ఫ్ వ్యవస్థ విలువలు, స్ఫూర్తికి విరుద్ధ మన్నారు. ఈ యాక్టు ఏ రూపంలోనూ ఆమోదయోగ్యం కాదని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలని వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. యునైటెడ్ జాయింట్ యా క్షన్ కమిటీ సభ్యులు మేయర్ వసీం, ఖాజా హుస్సేన్, అలిపీర, బంగారు బాషా, కాగజ్‌గర్ రిజ్వాన్, నదీమ్ అహ్మద్, సైపుల్లాబేగ్, ఖాజా, ఐఎంఎం బా షా, టిప్పుసుల్తాన్, జాకీర్, ముక్తియార్, వేమల నదీమ్ తదితరులు పాల్గొన్నారు.



డిఆర్ఓ మలోలకు వినతిపత్రాన్ని అందజేస్తున్న యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు

## సెమిస్టర్ ఫీజుల చెల్లింపుల గడువు పొడిగించండి

### - విద్యార్థులకు ఫీజు ఒత్తిడిని తగ్గించండి - జెఎన్‌టియుఏ విసిని కోరిన చంద్రశేఖర్ యాదవ్

అనంతపురం సిటీ, ఏప్రిల్ 11 ప్రభాతవార్త

.ఇంజినీరింగ్ విద్యార్థులకు సెమిస్టర్ ఫీజు చెల్లింపుల గడువు తేదిని పొడిగించాలని వైఎస్ఆర్‌సిపి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్, జెఎన్‌టియుఏ రిజిస్ట్రార్ కృష్ణయ్యను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫీజు రీయెంబ ర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగా కళాశాలల ఖాతాలలోకి వేస్తామని అసెంబ్లీ వేదికగా మంత్రి నారాలోకేష్ ప్రకటించారన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయెంబర్స్‌మెంట్ బకాయిలపై విద్యార్థులను వేదింపులకు పాల్పడితే కళాశాలల గుర్తింపును రద్దు చేస్తామని కూడా హెచ్చరించారన్నారు. ఇదే సర్క్యులర్‌ను జెఎన్‌టియుఏ పరిధిలో అన్ని కళాశాలలకు పంపించారన్నారు. అయితే కొన్ని కళాశాలలు రాజకీయ అండతో బకాయిలు చెల్లిస్తేనే పరీక్ష ఫీజులు కట్టించుకుంటామని విద్యార్థులను వేదిస్తుండటంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నా రన్నారు. పరీక్ష ఫీజులను ఫీజు రీయెంబర్స్ మెంట్‌తో సంబంధం లేకుండా కట్టించుకోవాలని, ఫరీక్ష ఫీజు తేదిని పొడిగించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు వెంకట్, సాకే మురళీ, శేఖర్, వంశీనాయుడు, నరేంద ర్‌రెడ్డి, గంగశివుడు, రాజేష్, సూర్య తదితరులు పాల్గొన్నారు.



జెఎన్‌టియుఏ కృష్ణయ్యకు వినతిపత్రం అందిస్తున్న వైసిపి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు

## జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు

కదిరి, ఏప్రిల్ 11 ప్రభాతవార్త

జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బైరవ ప్రసాద్ ఆధ్వర యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పూలే విగ్రహానికి కార్యకర్తలు, నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు.

**ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..**పట్టణంలోని స్థానిక ఎస్‌టిఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి వేడుకలను పాఠశాల ప్రిన్సిపాల్ స్మిత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మహాత్మాజ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన వెనుకబడిన వర్గాల కోసం అందించిన సేవలను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది డాక్టర్ రవీంద్ర, డా.నరసింహాచారి, డా.నాత్రిన్, ఇతర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

**శాంతినికేతన్ పాఠశాలలో..**పట్టణంలోని శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ మోమిన్ సలీమ్‌బాషా ఆధ్వర్యంగో ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ మోమిన్ సలీమ్‌బాషా, పాఠశాల సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

**ఎస్సీ ఎస్టీ, బిసి, మైనార్టీ ఉద్యోగుల ఆధ్వర్యంలో..** మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంఇఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగేంద్ర నాథ్, ఆనంద్, కోళ్ల రమణ, సుబ్బయ్యనాయక్, రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో పట్టణంలోని మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాలులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పూలే విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న జనసేన నాయకులు

## అకాల వర్షం.. అపార నష్టం..

### - తీవ్రంగా నష్టపోయిన అరటి, బొప్పాయి, మొక్కజొన్న పంటలు
### - పంట నష్టంతో లబోదిబో అంటున్న రైతులు.

కూడేరు, ఏప్రిల్ 11 ప్రభాతవార్త

పచ్చటి అరటి తోటలు, బారెడు గెలలతో కోతకు సిద్ధమయ్యాయి తమ ఆశలు పండించేలా ఉన్న తోటల్ని చూసి రైతు కళ్లల్లో ఆనందం తాండవించింది. ఇక అప్పులన్నీ తీరతాయని ధైర్యం వచ్చింది. కానీ ఇంతలోనే విపరీతమైన గాలితో అకాల వర్షం భీభత్సం సృష్టించింది. ఎటు చూసినా విరిగిన అరటి చెట్లు.. నేలవాలిన తోట. చేతికందే దశలో పంట నేలపాలై కంట నీరు పెట్టుకున్న రైతు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియని దీనస్థితి. కూడేరు మండలం మరుట్ల ఒకటవ కాలనీకి చెందిన రైతు కమతం లక్ష్మీదేవి నెట్టికంటయ్యలకు చెందిన నాలుగు ఎకరాల అరటితోట నేలకొరిగింది. కురిసిన అకాల వర్షానికి ఎనిమిది లక్షల అపార నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న అరటి పంట నేలకొరిగితే రైతు ఆవేదన చెప్పుకోలేనిదని చుట్టుప్రక్కల ఉన్న రైతులు అన్నారు. గురువారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీవర్షం కురవడంతో మండలంలో వివిధ గ్రామాల్లోని అరటి, బొప్పాయి, మొక్కజొన్న రైతుల తోటలను పరిశీలించి తీవ్రంగా నష్టపోయినట్టు ప్రాథమికంగా అంచనా వేశామని ఉద్యాన శాఖ అధికారి నెట్టికంటయ్య విలేకరులకు తెలియజేసారు.కోటి ఆశలతో అప్పులు చేసి అరటి పంటను సాగు చేస్తే అకాల వర్షం, ఈదురు గాలులు కోలు కోలేని దెబ్బతీ శాయి. ఈ వర్షానికి తీవ్రంగా నష్టపోయాం. మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.





నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న అధికారులు

## సంగమేశ్వర స్వామి నూతన రథం నిర్మాణం కొరకు భారీ విరాళాలు

### - అరవకూరు గ్రామ ప్రజలు రూ.లక్ష రూపాయలు విరాళం

కూడేరు, ఏప్రిల్ 11 ప్రభాతవార్త

శ్రీ జోడి లింగాల సంగమేశ్వర స్వామి నూతన రథం నిర్మాణానికి అరవకూరు గ్రామానికి చెందిన గ్రామ ప్రజలు కలిసికట్టుగా అరవకూరు గ్రామం నుండి స్వామి వారి నూతన రథం నిర్మాణం కొరకు నేడు శనివారం జరుగుతున్న సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నూతనంగా నిర్మించిన రథోత్సవమునకు కూడేరు గ్రామం నుండి నిర్మాణం కొరకు భారీగా విరాళాలు ఇవ్వగా, శనివారం అరకుకూర గ్రామ ప్రజలు లక్ష రూపాయలు నగదును ఆలయ అధికారి రమేష్ బాబుకు అందజేశారు.అలాగే కూడేరు గ్రామానికి చెందిన టీడీపీకి నాయకుడు మద్దినేని శ్రీనివాసులు నాయుడు రూ.30111 విరాళంగా ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ సంగమేశ్వర స్వామి రథోత్సవానికి నూతన రథ నిర్మాణాన్ని వేగవంతంగా పనులు చేపట్టడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం ఆల య పూజారి మహేశ్ స్వామి ప్రత్యేక పూజలు ఏర్పాటు చేసి వారికి స్వామి వారి తీర్థ ప్రసాదా లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అరవకూరు సర్పంచ్ రామాంజనేయులు, మాజీ సర్పంచ్ తెదేపా నాయకులు కురుగుంట ప్రసాద్, తెదేపా మండల నాయకులు పుట్టా నరేష్, గ్రామ టిడిపి అధ్యక్షుడు బంది శ్రీరాములు, గ్రామ పెద్దలు సుబ్బారెడ్డి, కమ్మే రామాంజనేయులు, కురుబ లక్ష్మినారాయణ, కురుబ శ్రీనివా సులు, బందీ సంగప్ప, నారాయణప్ప, ఓబులేసు, కేశవరెడ్డి, రామకృష్ణ, చెన్నయ్య, శేఖర్, మహేష్, సుబ్బరాయుడు, ఎర్రప్ప రామకృష్ణ తదితరులు అరవకూరు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



దాతలు విరాళం అందజేస్తున్న దృశ్యం..

## దేశంలో మహాత్మా అని మొట్టమొదటి పిలిపించుకున్న వ్యక్తి పూలే

### - ఆ మహనీయుని బాటలోనే టీడీపీ నడుస్తోంది - పూలే జయంతి వేడుకల్లో అర్బన్ టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 11 ప్రభాతవార్త

దేశంలో మహాత్మా అని మొట్టమొదట పిలిపించుకున్న గొప్ప వ్యక్తి మహాత్మా జ్యోతిబా పూలే అని అనంతపురం అర్బన్ టీడీపీ నాయకులు అన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచన మేరకు అర్బన్ టీడీపీ కార్యా లయంలో జ్యోతిబా పూలే 199వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో అర్బన్ నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకు లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముందుగా పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పూలే ఆశయాలు కొనసాగి స్తామని నాయకులు ప్రతిన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పూలే దళితులు, మహిళల హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాడారని, అంటరాని తనం, కుల వివక్షతను నిర్మూలించడానికి ఆయన చేసిన కృషి చిరస్మర ణీయమైనదన్నారు. మహిళల విద్య కోసం ఆయన తన భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి పాఠశాలను ప్రారంభించారన్నారు. ఆ మహా నీయుడు కలలు కన్న విధంగానే బడుగుబలహీన వర్గాలకు, మహిళలకు తెలు గుదేశం పార్టీ అధిక ప్రాధాన్యమిచ్చిందన్నారు. వారు ఆర్థికంగా, సామాజికంగా పురోభివృద్ధి సాధించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు పని చేస్తున్నారన్నారు. ఆ మహనీయుల అడుగుజాడల్లో మేమంతా నడుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, టిడిపి రాష్ట్ర కార్య దర్శి రాయల్ మురళి, నగర ప్రధాన కార్యదర్శి ముక్తి యార్, పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కూచి హరి, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, తెలు గు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, బీసీ సెల్ నగర అధ్యక్షుడు గోపా ల్ గౌడ్, కార్పొరేటర్ బాలాంజనేయులు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటప్ప, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కృష్ణకుమార్, మైనార్టీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి జెఎం భాష, టిడిపి నాయకులు దగ్గుపాటి రాజా, నెట్టెం బాలకృష్ణ, జోగి రాజేంద్ర, కాయగూరల శ్రీధర్ రాయల్, నారాయణస్వామి యా దవ్, మణికంఠ బాబు, వేలూరు మారుతి నాయుడు, ఓంకా రెడ్డి, తాటి మధు, కృష్ణం రఘు, కదిరప్ప, వడ్డే వెంకటేష్, సిరి శాల రాంబాబు, బళ్లారి గోపాల్, ఎన్ఎకె నారా యణస్వామి, మాజీ ఎంపీపీ ఇస్మాయిల్, వడ్డే హరి తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న టిడిపి నాయకులు

## నీరు ఆరోగ్యంగా తాగండి ఆరోగ్యంగా ఉండండి

### - మై భరత్ ఏపీ కోఆర్డినేటర్ బిసాటి భరత్

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 11 ప్రభాతవార్త

ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో "వాటర్ బెల్" కార్యక్రమం నిర్వహణ ఈరోజు అనంతపురం రూరల్ పరిధి కురుగుంట గ్రామం నందు ఉన్న జిల్లా పరిషత్ ప్రాథమిక స్కూల్‌లో ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 సంయుక్త ఆధ్వర్యంలో వాటర్ బెల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మై భారత్ స్టేట్ కోఆర్డినేటర్ బిసటి భరత్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు వర్మ, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.విష్ణు ప్రియ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మై భారత్ కోఆర్డినేటర్ బిసాటి మాట్లాడు తూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్య శాఖ మంత్రి నారా లోకేష్ ప్రవేశపెట్టిన వాటర్ బెల్ కార్యక్రమాన్ని మా పాఠశాలలో నిర్వహించడం చాలా సంతోషదాయకమని ఈ కార్యక్రమానికి తోడుగా ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ విద్యార్థులకు వాటర్ బాటిల్స్‌ను ఉచితంగా పాఠశాలలో అందించడం జరిగిందని ఈ వాటర్ బాటిల్స్‌లో నీరు నింపుకొని విద్యార్థులు సమయానికి క్రమం తప్పకుండా గంట గంటకు నీరు త్రాగాలని ఆయన తెలిపారు. ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం విష్ణు ప్రియ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వాటర్ బెల్ కార్యక్రమం కార్యక్రమం ద్వారా విద్యార్థులలో మరీ ముఖ్యంగా ఎండాకా లంలో నీరు సరైన సమయంలో త్రాగక విద్యార్థులు అనేక అనారోగ్యాలకు గురికాకుండా నిర్ణీత సమయంలో నీరు తాగాలని పాఠశాలలలో గంట గంటకు వాటర్ బెల్ కొడుతూ విద్యార్థులు నీరు త్రాగే విధంగా ఉపాధ్యాయులు సహకరి స్తున్నందుకు, ఈ పథకాన్ని ప్రవేశపెట్టడాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయా న్ని మేము స్వాగతి స్తున్నామని ఇలాగే జిల్లాలో మరిన్ని పాఠశాలలో ఈ ఉచిత వాటర్ బాటిల్స్ పంపిణీ కార్యక్రమం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి అవార్డు గ్రహీత కురబ జయమారుతి, ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి జి.ప్రసిల్లా, ఇండియన్ రెడ్ క్రాస్ వాలంటీర్లు కే.మహేంద్ర, జి.నందిత, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వాటర్ బెల్ మోగించడంతో నీటిని తీసుకెళ్లడానికి బయటికి వచ్చిన విద్యార్థులు

## మహిళా సాధికారతకు కృషి చేసిన వ్యక్తి మహత్మ జ్యోతిరావు పూలే

### ఎంపిపి వరలక్ష్మి ఈశ్వరయ్య,ఎంపిడిఓ దివాకర్.

అనంతపురం రూరల్, ఏప్రిల్11ప్రభాతవార్త:

మహిళా సాధికారతకు కృషి చేసిన వ్యక్తి మహత్మ జ్యోతిరావు పూలేన్నాని ఎంపిపి వరలక్ష్మి ఈశ్వరయ్య, ఎంపిడిఓ దివాకర్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయ ంతి సందర్భంగా వారు ఆయన చిత్రపట్టానికి పూలమా లవేసి నివాళుల్ప ంచా రు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి అనుక్షణం పరితపించిన వ్యక్తి మహత్మ జ్యోతిరావు పూలేన్నారు. అలాగే కుల వ్యవస్థ నిర్మూలనకు శ్రీకారం చూటడడం జరిగిందన్నారు. మహిళా సాధికార తకు కృషి చేసిన వ్యక్తి మహత్మ జ్యోతిరావు పూలేన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ,ఎన్ఆర్‌జీఎస్ కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మహత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం.

## సహకార సంఘాలను మరింత పటిష్టం చేసి రైతులకు సేవ చేయాలి అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

అనంతపురం వైద్యం ఏప్రిల్ 11 ప్రభాతవాస్తహకార సంఘాలను మరింత పటిష్టం చేసి రైతులకు సేవ చేయాలని జిల్లా సహకార అధికారి, ఏ డి సి సి బ్యాంకు సీఈవో అరుణ కుమారి సురేఖ రాణిలకు జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సహకార సంఘాల కంప్యూటరీకరణ పూర్తి అయిన సందర్భంగా జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ,జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మలను జిల్లా సహకార అధికారి అరుణకుమారి ఎడిసిసి బ్యాంక్ సీఈవో సురేఖ రాణీలు కలసి వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విజన్ డాక్యుమెంట్ లో భాగంగా సహకార సంఘాల కంప్యూటరీకరణ జిల్లాలో సమర్థవంతంగా జరిగిందని రాష్ట్రస్థాయిలోనే ద్వితీయ స్థానాన్ని కైవసం చేస్తుందని ఈ సందర్భంగా ఇందుకు కృషి చేసిన డిసిఒ ఎడిసిసి బ్యాంకు సీఈఓ లను కలెక్టర్ అభినందించారు. అనంతపురం ఉమ్మడి జిల్లాలో108 ప్రాథమిక సహకార సంఘాల కంప్యూటరీకరణ పూర్తి చేసుకొందని,వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో మాన్యువల్ విధానం లో లావాదేవీలు నిర్వహించరాదని కేవలం ఆన్లైన్ ద్వారా మాత్రమే నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో డి ఎల్ సి ఓ ప్రభాకర్ రెడ్డి, డి పీడీఎం తేజస్విని ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్, జాయింట్ కలెక్టర్లను సన్మానిస్తున్న దృశ్యం

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన కాలవ

అనంతపురం, ఏప్రిల్ 11, (ప్రభాత వార్త బ్యూరో)

అనారోగ్య కారణాలతో ఆస్పత్రి పాలైన బాధిత కుటుంబాలకు వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూత నందిస్తోం ది. రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని పలువురికి ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను ప్రభుత్వ విప్, శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు శుక్రవారం బాధితులు, వారి కుటుంబ సభ్యులకు అందచేశారు. ఆరు మందికి రూ.5.16లక్షలు ఎమ్మెల్యే అందచేశారు. రాయదుర్గం రూరల్ గ్రామ దట్ల గ్రామానికి చెందిన గొల్ల మల్లికార్జునకు రూ.201955, పులకుంటకు చెందిన ఎన్. రుద్రాక్షికి రూ.87718, గోనెహాల్ వన్నూరు స్వామికి రూ.38000, బీ. గొల్లపల్లికి చెంసిన కొలిమీ జయతున్ కు రూ.78658, గొనబావికి చెందిన వడ్డే జ్యోతికి రూ. 69148, కదిరంపల్లికి చెందిన డి.నాగలక్ష్మి రూ.41112ల చెక్కులు అందుకున్నారు.



చెక్కును పంపిణీ చేస్తున్న దృశ్యం

## నేత్రదానం అన్ని దానాల కన్నా మిన్న

### సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయ సాయికుమార్

అనంతపురం వైద్యం ఏప్రిల్ 11 ప్రభాతవా ర్తనేత్రదానం అన్ని దానాల కన్నా మిన్న అని సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయ సాయికుమార్ అన్నారు అనం తపురం నగరంలోని ఎన్టీఆర్ మార్క్ రాజహంస అపార్ట్మెంట్లో నివసిస్తున్న అన్నయ్య శెట్టి భార్య రామలక్ష్మి మృతిచెందగా ఆమె కుటుంబ సభ్యులను ఒప్పించి సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆమె నేత్రాలను సేకరించి ఎల్ వి ప్రసాద్ కంటి ఆసుపత్రికి ఆ నేత్రాలను పంపించాం అని సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయ సాయికుమార్ తెలిపారు.ఎల్.వి. ప్రసాద్ ఐ హాస్పిటల్ చెందినా ఆప్తమాలిక్ అసిస్టెంట్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో రెండు నేత్రాలను సేకరించి నేత్రాలను హైదరాబాదులోని ఎల్వి ప్రసాద్ ఆసుపత్రి కి ఇది చేరుస్తామని పేర్కొన్నారు. నేత్రదానం చేయాలనుకోనేవారు 87123455 20, 9666756921 ఫోన్ నెంబర్లలో సంప్రదించగలరని సూచించారు. ఈ కార్యక్రమం లో సాయి ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు



నేత్రాలను ఎల్వి ప్రసాద్ ఆసుపత్రికి అందజేస్తున్న దాతలు)

## తాటిచెర్ల ప్రభుత్వ పాఠశాలకు టీవి వితరణ

అనంతపురం రూరల్, ఏప్రిల్11ప్రభాతవార్త:

అనంత రూరల్ మండలం తాటిచెర్ల ప్రభుత్వ పాఠశాలకు ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ న్యూ ఢిల్లీ వారి ఆధ్వర్యంలో ఐటిసి వారి సహకారంలో ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రోగ్రాంలో భాగంగా రూ.1లక్ష 70 వేలు విలువ గల 75 ఇన్చల ఒక డిజిటల్ స్మార్ట్ బోర్డ్ టివిని ఐజిడి జిల్లా కో ఆర్డనేటర్ ధర్గగయ్య,ఆ పాఠశాల పూర్వ విద్యార్థి, ఐజిడి స్టాఫ్ కె.సుదర్శన్‌రెడ్డిలు పాఠశాల హెచ్ఎం రాంకుమార్,ఇంచార్జ్ అశోక్ కుమార్‌రెడ్డిలకు అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం రాంకుమార్,ఇంచార్జ్ అశోక్‌కుమార్‌రెడ్డిలు మాట్లాడుతూ ఐజిడి జిల్లా కో ఆర్డనేటర్ ధర్గగయ్య,ఆ పాఠశాల పూర్వ విద్యార్థి,ఐజిడి స్టాఫ్ కె.సుదర్శన్‌రెడ్డిలు మా పాఠశాలకు అందజేసినందుకు వారి కృతజ్ఞతాలు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ టీవి ఏవిధంగా ఉపయోగించాలని అనే దానిపై హైదరాబాదు నుంచి మాస్టర్ వచ్చి పాఠశాల టీచర్లుకు ఒక రోజు ట్రైనింగ్ ఇవ్వడం జరుగు తుందని ఐజిడి జిల్లా కో ఆర్డనేటర్ ధర్గగయ్య,ఆ పాఠశాల పూర్వ విద్యార్థి,ఐజిడి స్టాఫ్ కె.సుదర్శన్‌రెడ్డిలు తెలిపారు.ఈ స్మార్ట్ టీవి బోర్డు టీచర్లుకు విద్యార్థులకు మంచి విద్య అందివ్వడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు.



ఉపాధ్యాయులకు టివి అందిస్తున్న దృశ్యం,

## ఉచిత బ్రాహ్మణ ఉపనయనాలు

అనంతపురం, ఏప్రిల్ 11, (ప్రభాతవార్త బ్యూరో)

శ్రీ శ్రీ శ్రీ 1008 సత్యాత్మతీర్థుల ఆజ్ఞ అనుగ్రహములతో అక్షయతృతీయ పర్వదినం సందర్భంగా బుధవారం ఈనెల 30న శ్రీ విశ్వమధ్వపరిషత్ అనంతపురం శాఖ అధ్వర్యమున ఉచిత ఉపనయన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీ మూలాంజనేయ దేవస్థానం (ఉత్తరాది మఠం) పాతవూరు లో ఉపనయనాలు జరుగుతాయన్నారు. ఇప్పటికే నలుగురు వటువులు నమోదు చేసుకున్నారని ఇంకా ఒకరు లేదా ఇద్దరు వటువులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. శాఖా భేదం లేకుండా త్రి మతస్థ బ్రాహ్మణలకు అవకాశం ఉంటుందన్నారు. ఉపనయనం చేసుకునే వటువులకు అవసరమైన మొత్తం సామగ్రి, వారి పరివారమునకు తీర్థ ప్రసాదము ఏర్పాటు చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు విశ్వధ్వమహా పరిషత్ అనంతపురం శాఖ ప్రతినిధులు కె. పి. గురురాజ్ 9704315757 కె. పద్మనాభాచార్ 9441230303 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

## జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజా ప్రతినిధులు

బుక్కరాయసముద్రం ఏప్రిల్ 11 ప్రభాతవార్త సాంఘిక విప్లవ జ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలను శుక్రవారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి ప్రజాప్రతినిధులు ఎంపీపీ దాసరి సునీత, జడ్పిటిసి నీలం భాస్కర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే మహారాష్ట్ర పూణేలో 1827 ఏప్రిల్ ఏప్రిల్ 11న జన్మించారు. కుల వ్యవస్థ నిర్మూలన కోసం ఎన్నో పోరాటాలు చేశారు. మహిళల కోసం ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేశాడు. వాటిని మనువాద సమాజం జీర్ణించుకోలేకపోయింది. మహిళా విద్యను తన ఇంటి నుండి ప్రారంభించారు. పూలే నిరక్షరాశులయిన తన భార్య సావిత్రిబాయికి తానే చదువు నేర్పించి ఆమెను ఒక ఉపాధ్యాయురాలుగా తీర్చిదిద్దారు. అప్పటికే ఆయన వితంతువులకు అనాథ మహిళలకు శిశువులకు శరణాలయాలను స్థాపించారు. పూలే దంపతులు బడుగుల వర్గాల విజ్ఞాన వికాసాల కోసం సత్యశోధ సమాజ్ వంటి సంస్థలు ప్రారంభించారు. పూలేను బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక ఆదర్శమూర్తిగా గురువుగా పేర్కొని గౌరవించేవారు ఈ కార్యక్రమంలో వారితోపాటు ఎంపీడీవో సాల్మన్ రాజ్, పి ఆర్ జె మద్దిలేటి, ఆర్డబ్ల్యూఎస్ జేఈ నాగేంద్ర, స్థానిక నాయకులు బుల్లె నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### హ్యాపీ బర్త్‌డే



ఎస్.హార్ధిక

తల్లి : ఈశ్వరమ్మ

తండ్రి : ఎస్. సురేష్

శింగనమల గ్రామం

# పోలీసులపై వై.ఎస్.జగన్ వ్యాఖ్యలను వక్రీకరించారు..!

## జగన్‌ను విమర్శించేస్థాయి ఎస్ఐ సుధాకర్ యాదవ్‌కు ఎక్కడిది? - తప్పు చేసినవారు, పోలీసులైనా సరే చట్టం ముందు సమానమే - నేరం నిరూపణ అయితే యూనిఫాం తీసివేసే కదా శిక్ష అనుభవించాలి - పోలీస్ వ్యవస్థ గౌరవాన్ని కాపాడేలా నాడు సీయంగా జగన్ పనిచేశారు - ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్ వై.శివరామిరెడ్డి

ఉరవకొండ, ఏప్రిల్ 11 ప్రభాతవార్త

పోలీసులపై మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారని ఎమ్మెల్సీ, రాష్ట్ర శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మెన్ వై.శివరామిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని తన స్వగృహంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో చట్టానికి బదులుగా తెలుగుదేశం పార్టీకు తొత్తులుగా మారి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు అనుకూలంగా వ్యవహరిస్తున్న కొద్దిమంది పోలీసులను ఉద్దేశించి వై.ఎస్.జగన్ హెచ్చరికగా మాట్లాడారన్నారు. తప్పు చేసిన పోలీసులను న్యాయస్థానాల ముందు దోషులుగా నిలబెట్టి వారు తొడుక్కున్న యూనిఫాంలను తీయించేస్తామని చెబితే దాన్ని వక్రీకరిస్తున్నారన్నారు. పోలీస్ వ్యవస్థ గౌరవం కాపాడేలా ముఖ్యమంత్రిగా ఆనాడు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పనిచేశారని నేడు కూటమి ప్రభుత్వం మొత్తం పోలీస్ వ్యవస్థనే నీరుగార్చేలా చేస్తోందని ఆరోపించారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో కొందరు పోలీసులు అధికార పార్టీ చేతిలో కీలుబొమ్మలుగా మారి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరించారన్నారు. రామగిరిలో కూడా స్థానిక ఎస్ఐ సుధాకర్ యాదవ్ ఇదే తరహాలో ప్రవర్తించారని తప్పుచేసిన వారు ఎప్పటికైనా చట్టం ముందు దోషులుగా నిలబడాల్సిందేనని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ అత్యంత ప్రజాధరణ కల్గిన నాయకుడని గుర్తుంచుకోవాలన్నారు. ఒక మండల ఎస్ఐ మాజీ ముఖ్య మంత్రి గురించి అనుచితంగా మాట్లాడే పరిస్థితి ఈ రాష్ట్రంలో ఉందంటే పోలీస్ వ్యవస్థను రాజకీయ ప్రయోజనాల కోసం సాధనంగా ఏవిధంగా మార్చారో అర్థం చేసుకోవచ్చన్నారు. జగన్ సత్యసాయి జిల్లా పర్యటనలో అడుగడుగునా భద్రతా వైఫల్యం కనిపించిందని అయితే కూటమి ప్రభుత్వం మాత్రం 1,300 మంది పోలీసులతో భద్రత కల్పించామని చెబుతోందని విమర్శించారు. పోలీసులను జగన్‌ను కలవడానికి వచ్చే అభిమానులను, పార్టీ కార్యకర్తలను నిలవరించడానికే ఉపయోగించారుగాని ఆయన భద్రతకు కాదని ఎమ్మెల్సీ ఎద్దేవా చేశారు.



వై.శివరామిరెడ్డి

**వై.ఎస్.భారతిపై టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్ వ్యాఖ్యలు దారుణం :** మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి సతీమణి వై.ఎస్.భారతిపై టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్ చేసిన వ్యాఖ్యలు అత్యంత దారుణమని ఇలాంటి వ్యాఖ్యలను సహించబోమని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. ఏ పార్టీలోనైనా మహిళల వ్యక్తిత్వాన్ని హననంచేసే వ్యాఖ్యలు తప్పని, ఇలాంటి సాంప్రదాయాన్ని ఏ పార్టీ వారైనా తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మీడియాను టీడీపీ ఈ విధంగా వాడుకోవడం తప్పని ఇలాంటి వాటిని ప్రజల హర్షించరన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వారెవరైనా ప్రజా కోర్టులో శిక్షణను ఎదుర్కోవాల్సిందేనని ఎమ్మెల్యే వై.శివరామిరెడ్డి అన్నారు.

# అనంతలో అకాల వర్షాలకు ఈదురుగాలులకు భారీగా నష్టం

## 13మండలాలలో 881మంది రైతులకు పంట నష్టం. 1136హెక్టార్లలో పంట దెబ్బతిన్నదని అంచనా...882.41లక్షల నష్టం

అనంతపురం (వ్యవసాయం), ఏప్రిల్ 11 ప్రభాతవార్త:

అనంతపురం జిల్లాలో గురువారం రాత్రి పలు నియోజక వర్గాలలోని 14మండలాల్లో కురిసిన అకాల వర్షాలకు ఈదురు గాలులకు సుమారుగా 881మంది రైతులకు సంబంధించి మొక్క జొన్న, వరి, పత్తి పంటలు సుమారుగా 1136హెక్టార్లలో దెబ్బతిన్నాయని వ్యవసాయ అధికారులు ఆయా మండలాల నుంచి అంచనాలు సిద్ధం చేసి పంపారని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి ఉమా మహే శ్వరమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ లెక్కన మొత్తం 882.41 లక్షల నష్టం వాటిలిందని ఆమె వివరించారు. 14మం డలాల్లో 33 గ్రామాల లో మొక్కజొన్న 63మంది రైతులకు గాను 659హె క్టార్లు పంట దెబ్బతినగా 560లక్షలు నష్టం వాటిల్లిందని, అలాగే వరి 239 మంది రైతులకు సంబంధించి 383హెక్టార్లలో 275లక్షల నష్టం వాటిలిందని, అలాగే పత్తి 39మంది రైతులకు గాను 94హెక్టార్లలో 47లక్షల పత్తి పంట నష్టం జరిగిందని ఆమె ప్రకటన ద్వారా తెలియజేశారు.



నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



నష్టపోయిన రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ

# హరోం.. హర — శరీరానికి ఇనుప కొక్కీలతో తమిళ భక్తుల విన్యాసాలు



శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూల విరాట్







ఇనుప కొక్కిలు గుచ్చుకొన్న భక్తులు

హిందూపురం ఏప్రిల్ 11 ప్రభాతవార్త

తమ ఇలవేల్పు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కి 42 రోజుల దీక్ష బునిన హిందూపురంలోని తమిళ భక్తులు అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ఒళ్ళు గగుర్పొడిచే రీతిలో తమ శరీర భాగాలకు ఇనుప కొక్కీలు వేసుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణంలోని బెంగళూరు రోడ్డులో ఉన్న పలని నగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో 60 ఏళ్లుగా వందలాది మంది తమిళులు నివసిస్తున్నారు. ప్రతి ఏటా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి రథోత్సవం లోభాగంగా ఈదీక్షలను వారుతీ సుకుంటారు. ఉదయం ఆలయం ప్రాంతం నుంచి వందలాది మంది భక్తులు భారీప్రదర్శనగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రతిమను ఉంచుకొని పట్టణ వీధుల్లో సాయంత్రం వరకు ప్రదర్శన చేపట్టారు. వీపుకి, చంపల పై, మొదలగు భాగాల్లో ఇనుప కొక్కీలను గుచ్చు కొని హారోం హర అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. పట్టణ ప్రజలు ఎంతో ఆసక్తిగా వేడుకలను చూసేందుకు తరలివచ్చారు. మున్సిపల్ ఛైర్మన్ రమేష్ హాజరై స్వామివారికి పూజలు నిర్వహించారు.

# ఆ పాఠశాలలో విద్యార్థుల దేహదారుఢ్యం గాలికి

## అసోసియేషన్ ను అడ్డుపెట్టుకొని నిబంధనలకు తూట్లు

హిందూపురం టౌన్ ఏప్రిల్ 11 ప్రభాతవార్త

వేలాది రూపాయలు విద్యార్థుల నుంచి ఫీజుల రూపంలో దండుకుంటూ, పాఠశాల నిర్వహణలో ఎంతో కీలకమైన క్రీడ మైదానం లేకుండా ఉన్నట్టు తప్పుడు పత్రాలు చూపించి ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడిచారు పాంచజన్య పాఠశాల నిర్వాహకులు. ప్రతి ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులు ఆడుకునేందుకు తప్పనిసరిగా క్రీడా మైదానం ఉండాలి. ఇది నిబంధనలలో అతి ముఖ్యమైనది. పాఠశాల అనుమతులు పొందేందుకు కూడా క్రీడా మైదానం చూపించాల్సిన అవసరం ఉంది. అయితే హిందూపురం పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్ పాఠశాలలో ఆటలు ఆడేందుకు క్రీడా మైదానం లేక విద్యార్థులు క్రీడల పట్ల నిరాదరణకు గురవుతున్నారు. ఆటస్థలం ఉండాలనే ప్రభుత్వ నిబంధనలను పాఠశాల యజమాన్యం తుంగలో తొక్కుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. విద్యార్థులు దేహ దారుఢ్యం పెరగాలంటే గ్రౌండ్ లో క్రీడలు ఆడాలి. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పాఠశాలలలో క్రీడా మైదానం తప్పనిసరిగా ఉండాలని ఆదేశాలు సైతం జారీ చేసింది. విద్యార్థులకు ఆటస్థలం లేకపోవడం వల్ల కలిగే నష్టాలు శారీరక అభివృద్ధి లేకపోవడం, పిల్లలు తగినంత శారీరక శ్రమ చేయలేరు. దీనివల్ల ఊబకాయం, ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది.







పాంచజన్య పాఠశా ఎంజీఎం గ్రౌండ్ చూపించి తప్పుడు పత్రాలతో అనుమతి

మానసిక అభివృద్ధి లేకపోవడం, ఆట స్థలం లేకపోవడం వల్ల పిల్లలు స్నేహితులతో కలిసి ఆడటం, జట్టుగా పనిచే యడం వంటి నైపుణ్యాలు అభివృద్ధి చెందవు, దీనివల్ల సామాజికంగా మరియు మానసికంగా పిల్లల అభివృద్ధి నిలిచిపోతుంది. సృజ నాత్మకత లేకపోవడం, వినూత్న ఆలోచనలు అభివృద్ధి చెందవు. ఆటస్థలం లేకపోవడం వల్ల విధి లేక పిల్లలు తరగతి గదిలో ఎక్కువ సమయం గడుపుతారు. దీనివల్ల వినోదం మరియు శారీరక శ్రమ లేకపోవడం వల్ల వారు నిద్రమత్తుగా మారవచ్చు. దీని వల్ల వారి విద్యాభ్యాసానికి ఆటంకం ఏర్పడుతుంది. పిల్లలు తమ సమయాన్ని ఆటల్లో, శారీరక శ్రమలో, మరియు ఇతర సామాజిక కార్యకలాపాల్లో గడపకపోవడం వల్ల వారిలో సహజమైన నైపుణ్యాలు అభివృద్ధి చెందవు. పాంచజన్య పాఠశాలలో క్రీడా మైదానం లేకపోయినా ఇరుకైన స్థలంలో పాఠశాల నిర్వహిస్తూ లక్షలకు లక్షలు యాజమాన్యం దండుకుంటోంది. విద్యార్థులు బాల్యం నుంచి ఎదిగే వయసు మనిషి జీవితంలో కీలకం విద్యార్థి దశలో క్రీడలు అతి ముఖ్యమైనవి ప్రభుత్వ విద్యా శాఖలో ప్రధానమైనది. క్రీడలు దీని కోసం రోజులో ఒక పీరియడ్ కూడా కేటాయిస్తారు. అయితే ఇక్కడ క్రీడా మైదానం లేకపోవడంతో విద్యార్థులు గతి లేక చదువుతున్నారు. గతంలో సుభాన్ సెట్ మున్సిపల్ ఛైర్మన్ గా ఉన్నప్పుడు పాఠశాల యజమాని తన పలుకుబడిని ఉపయోగించి ప్రభుత్వానికి చెందిన మహాత్మా గాంధీ మున్సిపల్ పాఠశాల క్రీడా మైదానాన్ని చూపించి అదిరికార్డులలో పొందుపరిచి అనుమతులు పొందినట్లు తెలిసింది. ప్రభుత్వ క్రీడా స్థలాన్ని తప్పుడు పత్రాలతో చూపి అనుమతులు పొంది పాఠశాల నిర్వహిస్తున్నట్లు ప్రజల్లో తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. పాఠశాల ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు ఆ పాఠశాలలో చదివే విద్యార్థులు క్రీడలకు దూరమవుతూ దేహ దారుఢ్యాన్ని కోల్పో తున్నారు. పాఠశాలలో క్రీడా మైదానం ఎక్కడుందని ప్రశ్నించిన వారికి ముడుపులు ఇచ్చి మేనేజ్ చేసుకుంటున్నట్లు తెలిసింది. ప్రవేట్ పాఠశాలల అసోసియేషన్ అడ్డుపెట్టుకొని యధేచ్ఛగా తన కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా చిన్న చితక ప్రోగ్రాములు చేస్తూ తమ పాఠశాల ఏదో ఘనకార్యం సాధించినట్లు పబ్లిసిటీ చేసుకుంటు పాఠశాలలోని లోపాలు కప్పిపెట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తుంటారని విమర్శలు ఉన్నాయి.

# బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలు చిరస్మరణీయం

## - వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం సిటీ, ఏప్రిల్ 11 ప్రభాతవార్త

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి మహాత్మాజ్యోతిరావు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి కొనియాడారు. మహాత్మాజ్యోతిరావుపూలే 199వ జయంతిని పురస్కరించుకుని జిల్లా వైసిపి కార్యాలయంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి జడ్పి ఛైర్మన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మలతోకలిసి జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్త్రీ విద్యకోసం ఎంతో కృషి చేశారన్నారు. పేదలు ఉన్నతస్థానానికి ఎదగాలంటే విద్యతోనే సాధ్యమవుతుందని, ఆ దిశగా కృషి చేశారన్నారు. జ్యోతిరావు పూలే స్ఫూర్తితో దివంగతనేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ చట్టాన్ని తీసుకొస్తే తండ్రి అడుగు జాడల్లో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం చదువులు అందించారన్నారు. ఆయన చేసిన సేవలను స్మరించుకోవడమే ఆయనకి అర్పించే నిజమైన నివాళి అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.



జ్యోతిరావుపూలేకి నివాళులు అర్పిస్తున్న అనంత, పార్టీ నేతలు

# వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం

హిందూపురం టౌన్ ఏప్రిల్ 11 ప్రభాతవార్త

జగదానందకారకుడు శ్రీ సీతారామ కళ్యాణోత్సవం శుక్రవారం సాయంత్రం హిందూపురంలో అత్యంత వైభవంగా జరిగింది. పట్టణంలోని దండురోడ్డులో ఉన్న 27 అడుగుల ఎత్తైన ఏకశిలా శ్రీ హనుమాన్ ఆలయ ఆవరణలో శ్రీరామనవమి వేడుకల సందర్భంగా కళ్యాణోత్సవం నిర్వహించారు. వేదమంత్రాలు మధ్య కళ్యాణ క్రతువును అర్చకులు సునీల్ శర్మ అత్యంత అద్భుతంగా నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు నారాయణ స్వామి, చౌడేష్, ప్రభాకర్, వెంకటేష్ మొదలగువారు నిర్వహణలో వేడుకలు చేశారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు



రాములోరి కళ్యాణం దృశ్యం

# సీతారాముల కళ్యాణం ఊరంతా వైభోగం

## - స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన బండారు కుటుంబ సభ్యులు



ప్రత్యేక అలంకరణలో సీతారామ మూల విరాట్ విగ్రహాలు



ఆత్మారామలను దర్శిం చుకు ంటున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



సీతారాముల కళ్యాణోత్సవానికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకెళ్తున్న దృశ్యం



కళ్యాణోత్సవంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, ఏప్రిల్ 11 ప్రభాతవార్త

వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ మండల కేంద్రంలోని ఆత్మారామ దేవాలయం కళ్యాణ మండపంలో సీతారాముల కళ్యాణం శుక్రవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, వారి కుటుంబ సభ్యులు బండారు లీలావతి, బండారు రవికుమార్ స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఆత్మారాముని దేవాలయంలోని ఆదర్శమూర్తి శ్రీరామ చంద్రుడు, అందాల భరణి సీతమ్మకు బండారు రవికుమార్, బండారు లీలావతి దంపతులు చేతులు మీదుగా కళ్యాణం జరిపించారు. చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ రాములోరి కళ్యాణోత్సవంలో భాగమై మైమరిచి పోయారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి భక్తాదులు పెద్ద ఎత్తున హాజరై సీతారాముల కళ్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం వచ్చిన భక్తాదులకు అన్నదానం, తర్వాత తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, మాజీ జడ్పిటిసి శాలిని, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి, గోరంట్ల మారుతినాయుడు, పసుపుల శ్రీరామిరెడ్డి, మాసుల్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతిరావు పూలేకి ఘన నివాళులు అర్పించిన వైసిపి నేతలు

అనంతపురం సిటీ, ఏప్రిల్ 11 ప్రభాతవార్త

మహాత్మాజ్యోతిరావుపూలే విగ్రహానికి వైసిపిప్రజా ప్రతినిధులు ఘన నివాళులు అర్పించారు. జిల్లా పరిషత్ ప్రాంగణంలోని మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహానికి జడ్పి ఛైర్మన్ బోయ గిరిజమ్మ, నగర మేయర్ మహ్మద్ వసీంలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు సగభాగమని, వారి అభివృద్ధితోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని భావించి మహాత్మా జ్యోతిరావు పూలే ఆ దిశగా కృషి చేశారన్నారు. అందులో భాగంగానే మహిళా విద్యకు, మహిళా సాధికారతకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్పోరేటర్లు సైఫుల్లా బేగ్, శ్రీనివాసులు, మాజీ వక్స్ బోర్డు అధ్యక్షులు కాగజ్‌ఘర్ రిజ్వాన్, నాయకులు చింతకుంట మధు, రామచంద్ర, లక్ష్మన్న, జావెద్, కాకర్ల శ్రీనివాసులు తది తరులు పాల్గొన్నారు.



పూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న జడ్పి ఛైర్మన్, మేయర్

# అనంతలో 102 వ జాయ్ లుక్కాస్ గోల్డ్ షోరూమ్ ను ప్రారంభించిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, జోయాలుక్కాస్ గ్రూప్ సీఈఓ జాయ్ అలుక్కాస్

అనంతపురం : ఏప్రిల్ 11, (ప్రభాతవార్త బ్యూరో )

ప్రపంచ స్థాయికి చెందిన జ్యూవెలరీ జాయ్ లూక్కాస్ సంస్థ ఆభరణాల కొనుగోలుదారులకు నాణ్యతలో సాటిలేనిదని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, ఆ సంస్థ ఎండి సీఈవో జాయ్ అలుక్కాస్ పేర్కొన్నారు. జాయ్ లుక్కాస్ 102వ జూవేలరి గోల్డ్ షోరూమ్ ను అనంతపురం నగరంలోని రాజు రోడ్ లో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి , జాయ్ లుక్కాశ్ ఎండీ సీఈవో జాయ్ అలుక్కాస్ చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, సంస్థ ఎండి సీఈవో జాయ్ ఆలూక్కాస్ మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి చెందిన జ్యూవెలరీ జోయాల ుక్కాస్ అనంతపురం నగరంలో రెం డవ షోరూమ్‌ను గొప్పగా ప్రారంభించుకోవడం ఒక ప్రధా నమైన మైలు రాయిగా నిలుస్తుందని చెప్పారు.. అంతర్జాతీయ స్థాయికి చెందిన ఆభరణాల అలంకరణలు విస్తారమైన సదుపాయాలు ఈ షోరూంలో ప్రజలకు అందు బాటులో ఉన్నాయన్నారు. కొనుగోలుదారులకు అనుగుణంగా సమస్త సేవల ను అందించడానికి ఎంతో నిబద్ధతతో ముందుకు రావడం అభినందించ దగ్గ విషయ మని పేర్కొన్నారు. ఈ షో రూమ్‌లో సంప్రదాయ బద్ధమైన స్టైల్స్ నుండి సమకాలిన స్టైల్ వరకు జోయా లుక్కాస్ షోరూమ్ లో ప్రజలకు అలంకార ఆభరణాలు అందుబా టులో ఉన్నాయని తెలిపారు .గోల్డ్ మరియు డైమండ్స్‌లో సరి కొత్త డిజైన్లు కొను గోలుదారులకు అనుకూలమైన ధరలతో అందు బాటులోకి తీసుకురా వడం జరిగిందని తెలిపారు. నైపుణ్యాలకు ప్రసిద్ధి చెందిన జోయాలుకాస్ వారి షోరూం అనుభవానికి ప్రతి ఒక్కరూ సందర్శించి ఉన్నతమైన సేవలు సాటిలేని నాణ్యత హామీతో ఉత్తమమైన జ్యూవెలరి పొందాలని కోరారు.



అనంతపురంలో జాయలుకాస్ రెండవ షోరూం ప్రారంభిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న జయలుకాస్ సీఈవో జయలుకాస్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

# జగన్ నోరు అదుపులో పెట్టుకో

## - ప్రజలు బుద్ధి చెప్పినా మార్పు లేదు - మీ తాటాకుల బెదిరింపులకు ఎవరూ భయపడరు - ఎమ్మెల్యే కందికుంట

కదిరి, ఏప్రిల్ 11 ప్రభాతవార్త

జగన్ నోరు అదుపులో పెట్టుకోవాలని మీ తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడరని, ప్రజలే నిన్ను రోడ్డుపైకి ఈడ్చి కొట్టేరోజులు దగ్గరలో ఉన్నాయని మా జీ ముఖ్యమంత్రి జగన్‌కు ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 8న రామగిరి పర్యటనకు జగన్ వచ్చి పోలీసులను బట్టలు ఊడదీసి కొడతామని మాజీ ముఖ్యమంత్రి అనడంపై ఎమ్మెల్యే కందికుంట ఘాటుగా స్పందించారు. శుక్రవారం పట్టణంలోని మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం వద్ద పూలేకు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ.. మహాత్మాజ్యోతిరావు పూలే మహారాష్ట్రలోని పూణేలో 1827 ఏప్రిల్ 11న కుల వ్యవస్థ నిర్మూలన కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. విద్యాభివృద్ధికి జీవితకాలం శ్రమించినా బహుజనుల బాగ్య విధ్యాత మన పూలే, కుల వివక్షత, అంటరానితనంపై కళాన్ని కత్తిగా దూషించిన గులాం గిరి కావ్య రచయిత అన్నారు. వైఎస్‌ఆర్‌సిపి అధినేత జగన్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఆయన బెదిరింపులకు ఎవరూ భయపడేవారు లేరని ప్రజలే ఆయనను, వారి పార్టీ నాయకులను రోడ్డుపై ఈడ్చుకొచ్చి కొట్టేరోజులు ఉన్నాయన్నారు. జగన్‌కు బట్టలు ఊడదీయడంతో చాలా మోజేమోనని వంశీ, కొడాలి నాని అందగాడని జగన్ చెప్పడం చూస్తే ఆయన ఆలోచన ఏమిటో ఎవరికి అర్థం కాదన్నారు. ఆ పార్టీ నాయకులు వ్యవహరించే తీరును చూస్తే ఒక జంబలకడి పంబ పార్టీగా ప్రజలు చూస్తున్నారన్నారు. 2014 ఎన్నికల్లో ఒక అభ్యర్థి యూనిఫాం తీయించి మీ పార్టీ అభ్యర్థి నిలబెట్టారని, అదే అభ్యర్థి గెలిచిన తర్వాత సోషయల్ మీడియాలో బట్టలు విప్పి అందరికీ చూపించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇలాంటి నాయకులు ఉన్న పార్టీని ప్రజలు ఎవరూ నమ్మరని, కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని, తిరిగి తామే అధికారం ఒలకి వస్తామని, అధికారం చేపట్టగానే 2.0 చూస్తారని జగన్ చెప్పడం హాస్యాస్పదంగా ఉంద న్నారు. అధికారంలో ఉన్న ప్పుడు మీరు చేయని నేరం లేద ని ఆయన విమర్శించారు. వైసిపి ప్రభుత్వంలోనే కదిరి నియోజక వర్గంలో ఓ సర్కిల్ స్థా యి పోలీసు అధికారి గంజా యి వ్యాపారులతో మిలాకత్ అయి వాహన బానెట్‌పై యూనిఫాంలో తొడకొట్టి మీసాలు తిప్పిన సంగతి నిజం కాదా అని నిలదీశారు. తాము మాత్రం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తప్పు చేసిన వారితో దండించి ఉద్యోగం చేయిస్తున్నామన్నారు. తప్పు చేస్తే ఏ పార్టీ వారైనా ఉపేక్షించమని తమ పాలనలో, వైసిపి ప్రభుత్వ పాలన ఉన్న తేడాను తెలుసుకోవాలన్నారు. ప్రజా సమస్యల కోసం పోరాటా నికై తాము ఎప్పుడూ వెనకడుగు వేయలేదని గత ప్రభుత్వ హయాంలో రోడ్డు ఎక్కి లాఠీ దెబ్బలు కూడా తిన్నామన్నారు. అలాగని దౌర్జన్యం చేస్తే చూస్తూ చేతులు కట్టుకోమని, ప్రాణాలు ఫణంగా పెట్టి ఎదురొడ్డడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఇప్పటికీ అధికారంలోకి వస్తామని అన్న భ్రమలో జగన్ జీవితం కొనసాగుతోందన్నారు. అనవసరమైన మాటలు మాట్లాడకుండా ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పూలే విగ్రహం వద్ద మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

# సిఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

అనంతపురం, ఏప్రిల్ 11 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం నందు తాళ్లకేర గ్రామం గుమ్మగట్ట మండలం చెందిన పీ.సరస్వతికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైద్య సహాయం కింద రూ.81,000 ఆర్థిక సహాయాన్ని చెక్కు ద్వారా అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మినారాయణ తన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఎంపీ మాట్లాడుతూ.. పేద ప్రజలకు వైద్య ఖర్చులను ఆర్థిక సహాయం చేయడం, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గొప్పతనం అని తెలియజేశారు. సరస్వతి, కుటుంబ సభ్యులు తమకు ఆర్థికంగా ఆదుకున్నటువంటి ముఖ్యమంత్రికి, పార్లమెంట్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు. ఆర్థిక సహాయం పేద ప్రజలకు కొండంత అండగా నిలుస్తుందని గ్రామస్తులు తెలియజేశారు.

# నిర్దిష్ట కాలపరిమితితో భూ సమస్యలు పరిష్కరించండి

**మొదటిపేజి తరువాయి....** జిల్లాలో రి సర్వే కి సంబంధించి మొబైల్ యాప్ ను రీ సర్వే డీటీలు విలేజ్ సర్వేయర్లు వీఆర్వోలు లాగిన్ అయి ఈ సర్వే కి సంబంధించిన పనులను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలన్నారు. తద్వారా సర్వే సమయంలో ఆ పనులకు సంబంధించి విషయాలను వెంటనే తెలుసుకొనుటకు సులభతరంగా ఉంటుందన్నారు. భూముల సర్వే ప్రక్రియలో రెవెన్యూ శాఖ పాత్ర ఎంతో కీలకమన్నారు. విధులలో ఎలాంటి అలసత్వం వహించకుండా పనులను వేగవంతం గా చేయాలని ప్రభుత్వ నిబంధన మేరకు ఆర్ఓఆర్ పనులు నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.సమాచార హక్కు చట్టం కొత్త నిబంధనలు వచ్చాయని గతంలో డిఆర్ఓ అప్పిలేట్ అధికారిగా ఉండేవారని ప్రస్తుతం ఆర్డీవోలు ఉంటారని తెలిపారుతహసీల్దార్ల,మండల సర్వేయర్లకు,బాధ్యతగాపనిచేయాలి అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుండి జిల్లా అంతట రీ సర్వే రెండో విడత ప్రారంభించాలని తెలిపారు. జిల్లాలో గ్రామాలలో 400 నుండి 450 ఎకరాలు బ్లాకులుగా విభజించాలని తెలిపారు రీ సర్వే జరిగేటప్పుడు ప్రతి గ్రామానికి అవసరాన్ని బట్టి 3 నుండి 4 బృందాలను కేటాయించాలి. ప్రతి బృందం 2 విలేజ్ సర్వేయర్లు, 1 విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ మరియు 1 విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ ని కలిగి ఉండాలి.పై బృందాలతో పాటు, ఆ గ్రామంలో పని చేస్తున్న ఒక విలేజ్ సర్వేయర్ మరియు ఒక విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ తో ప్రతి గ్రామానికి ప్రత్యేకంగా కమ్యూనికేషన్ ప్రయోజనం కోసం ఒక ప్రత్యేక బృందాన్ని నియమించాలి మరియు వారు ఎక్కడ సమస్య తలెత్తినా హాజరు కావాలి.ఈ విధంగా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలనిజిల్లా సర్వే అధికారిని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు పుట్టపర్తి సువర్ణ, ధర్మవరం మహేష్, కదిరి, శర్మ, పెనుగొండ ఆనంద్, సర్వే అండ్ ల్యాండ్ అధికారి విజయశాంతి భాను, జిల్లాలోని 32 మండలాల తహశీల్దార్లు మండల సర్వేర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిబా పూలే ఆశయాలను కొనసాగించాలి

**మొదటిపేజి తరువాయి....** తన రచనలలో పూలే అని అభినందించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఆనాటి పరిస్థితుల్లో వర్ణ వివక్ష, కుల వివక్ష ఉన్నటువంటి రోజుల్లో వాటికి వ్యతిరేకంగా నిలిచి, బాల్యవివాహాలను, వితంతు వివాహాలు వంటి సామాజిక రుగ్మతల పట్ల చైతన్యం చేసినటువంటి వ్యక్తిగా నిలిచారన్నారు. వెనుకబడిన కులాలను ముందుకు తీసుకొచ్చే విధంగా ఒక ఉద్యమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ రోజు మనందరం మన బాధ్యతలను గుర్తు చేసుకోవాలని, సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు అన్నది తమ పార్టీ సిద్ధాంతం అన్నారు. ఆనాడు కీ.శే. నందమూరి తారక రామారావు సారథ్యంలోని ప్రభుత్వం రాకతోనే సమాజంలో అన్ని వర్గాలకు రాజ్యాధికారాన్ని పంచాలి, పెంచాలి అనే విధానానికి శ్రీకారం చుట్టారన్నారు. సమాజంలో వెనుక బడినటువంటి కులాల, మతాల, సామాజిక వర్గాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, జిల్లా పరిషత్ సీఈవో రామచంద్ర రెడ్డి, బీసీ వెల్ఫేర్ డిడి ఖుష్బూ కొఠారి, డిటిడబ్ల్యువో రామాంజనేయులు, బిసి కార్పొరేషన్ డిడి సుబ్రమణ్యం, ప్రజా ప్రతినిధులు, వెనుకబడిన తరగతుల నాయకులు, కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.